ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
స్టేట్ విజన్
STATE VISION
గురువారం 20-08-2026 పేజీలు : 16

# “అక్రమ ఇసుక దందాకు చెక్”

**-“తెల్లవారు జామున టిప్పర్ పట్టుకున్న కల్వకుర్తి పోలీసులు”**

**-“డ్రైవర్ అరెస్ట్ - వాహనం సీజ్”**

–కల్వకుర్తి, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 19 : జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్, డిఎస్పి వెంకట్ రెడ్డి,సిఐ బీమ్ కుమార్ ఆదేశాల మేరకు అక్రమ ఇసుక తరలింపుపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.



7 పేజీలో...

# కోటి వెంకటేశ్వర్లు హత్య కేసు నిందితురాలు అరెస్ట్

## నిందితురాలిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపిన కె.సీఐ శ్రీధర్



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 19 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని హనుమాన్ నగర్ లో ఈనెల16వ తేదీన జరిగిన కోటి వెంకటేశ్వర్లు హత్య కేసులో నేరస్తురాలు కోటి రాజమణిని మంగళవారం రోజున స్థానిక పోలీసులు అరెస్టు చేసి విచారించగా,మృతుడు కోటి వెంకటేశ్వర్లుతో తనకు సుమారు 35 సంవత్సరాల క్రితం వివాహం జరిగిందని, వారికి ఇద్దరు కుమార్తెలు మరియు ఒక కుమారుడు ఉన్నారని తెలిపిందని హుస్నాబాద్ కె. సీఐ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 15 సంవత్సరాల క్రితం మృతుడు తనను మరియు తన పిల్లలను దూరంగా ఉంచి, మరొక మహిళను రెండవ వివాహం చేసుకొని ఆమెతో కలిసి నివసిస్తున్నాడని తెలిపిందని,అలాగే, మృతుడి పదవీ విరమణ సందర్భంగా లభించే ప్రయోజనాలు మరియు ఇతర ఆర్థిక ప్రయోజనాలను రెండవ భార్యకు అందజేయాలని నిర్ణయించుకున్నాడని, తనను మరియు తన పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నాడనే విషయాన్ని మనస్సులో పెట్టుకొని మృతుడిపై కోపం పెంచుకొని హత్య చేసినట్లు నేరస్తురాలు ఒప్పుకుందన్నారు. నేరస్తురాలు చూపించిన మేరకు,హత్యకు ఉపయోగించిన రోలు మరియు రోకలి బండను గుర్తించి, పంచనామా ప్రకారం స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. అనంతరం నేరస్తురాలు కోటి రాజమణిని గౌరవనీయ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచడం జరిగిందన్నారు. సీఐ వెంట ఎస్సై లక్ష్మారెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మడిపల్లి గ్రామంలో గుంటక రమేష్ హత్య.



తొర్రూరు ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర ) : తొర్రూరుమండలం,మడిపల్లి గ్రామానికి చెందిన గుంటుక రమేష్ (43)ను గ్రామం లో జరిగిన ఐదో రోజు,సంతాప కార్యక్రమంలో జరిగిన చిన్నపాటి గొడవ కారణంగా గుంటక రమేష్‌పై కర్రలు, రాళ్లతో కొట్టి అదే కులానికి చెందినగ్రామస్థులు,యాకన్నవెంకన్న,జంపయ్య,మహేష్‌తో పాటు మరో పది మందికి పైగా కలిసి దాడి చేసి, చెరువుదగ్గరకు,తీసుకెళ్లి,సమీపంలో హత్య చేసి పడవేసినట్లు మృతుడి భార్య రజితపోలీస్ ల కు పిర్యాదు ,చేసినారు .మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న తొర్రూరు పోలీసులు .ఘటనపై విచారణ చేపట్టి, నిందితుల పాత్రపై దర్యాప్తు చేస్తున్నా మని తెలిపినారు.

# ప్రజా పాలనలో తాండవిస్తున్న అవినీతి బాగోతం..!




16 పేజీలో...

## జిల్లా ఇంచార్జి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్

నిజామాబాద్, ఆగస్టు 19 :(విజన్ ఆంధ్ర )నిజామాబాద్ నగర పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి డి.అనసూయ సీతక్కను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రితో పాటు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీలకు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. వారితో కొద్దిసేపు భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.



# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

## - షాబాద్‌లో లూయిస్ డాగ్యురేకు ఘన నివాళులు



షాబాద్: ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని షాబాద్ మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శివలింగం గౌడ్, షాబాద్ మండల అధ్యక్షుడు మల్లేశ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1839 ఆగస్టు 19న ఫ్రెంచ్ ప్రభుత్వం 'డాగ్యురోటైప్' ఫోటోగ్రఫీ ప్రక్రియను అధికారికంగా ప్రపంచానికి పరిచయం చేసిన రోజుకు గుర్తుగా ప్రతి సంవత్సరం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫోటోగ్రఫీ రంగానికి విశేష సేవలందించిన లూయిస్ డాగ్యురేను ఈ సందర్భంగా స్మరించుకోవడం సంతోషకరమన్నారు. గతాన్ని చెరిగిపోని జ్ఞాపకాలుగా భద్రపరచడంలో ఫోటోగ్రఫీ కీలక పాత్ర పోషిస్తుందని, సమాజంలో జరుగుతున్న సంఘటనలను దృశ్యరూపంలో ప్రజలకు చేరవేయడంలో ఫోటోగ్రాఫర్ల సేవలు ఎంతో గొప్పవని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలోనూ ఫోటోగ్రాఫర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు శేఖర్, శ్రీధర్ రెడ్డి, దేవేందర్, లక్ష్మణ్, రవీందర్, వెంకటేష్, మహేశ్, మహేందర్, అంబేద్కర్, శ్రీశైలం, ప్రసాద్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తలారి తిరుపతి అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్..



ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రెంజల్ పోలీస్ స్టేషన్ యందు విధులు నిర్వహిస్తున్న తలారి తిరుపతి హెడ్ కానిస్టేబుల్ 1549 ప్రస్తుతం ఆర్మూర్ ఏసీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రు. తలారి తిరుపతి నిన్న అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందారు ఆయన మృతి పట్ల పోలీసు శాఖలో విషాదం నెలకొంది ఈ నేపథ్యంలో తలారి తిరుపతి అంత్యక్రియలు నేడు ఆర్మూర్ లో నిర్వహించారు అంత్యక్రియలకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి సాయి చైతన్య ఐపీఎస్ గారు హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన తలారి తిరుపతి పార్దివదేహానికి పుష్పగుచ్ఛం సమర్పించి ఘనంగా నివాళులర్పించారు అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి బాధను పంచుకొని ప్ర గాడ సానుభూతి తెలియజేస్తూ ఓదార్చారు ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు తలారి తిరుపతి మృతి పోలీసు శాఖకు తీరని లోటని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పోలీస్ కమిషనర్ శ్రీ సాయి చైతన్య ఐపీఎస్ గారు ఆకాంక్షించారు

ఈ సందర్భంగా ఆర్మూర్ ఏసీపి శ్రీ వెంకటేశ్వర రెడ్డి ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ శ్రీ సత్యనారాయణ గౌడ్ బోధన్ రూరల్ సిఐ విజయబాబు రెంజల్ ఎస్సై ఎం గంగాధర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకిల్ పాషా మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



జన్నారం, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : ప్రపంచ ఫో టోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా జరిగాయి. 187వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని బుధవారంరోజున జన్నారం మండల ఫో టో మరియు వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేష న్ అధ్వర్యంలో ఫోటోగ్రఫి దినోత్సవ వేడుకలు ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేం ద్రంలో గౌరవ అధ్యక్షులు కస్తూరి ప్రభాకర్ ఫోటోగ్ర ఫి జెండాను ఆవిష్కరించి స్థానిక ప్రభుత్వ ఆసుప త్రిలో పండ్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయ న మాట్లాడుతూ ఫొటోగ్రఫీ అనేది కేవలం చిత్రాల ను తీయడం మాత్రమే కాదని భవిష్యత్ తరాలకు గుర్తుండేలా భద్రపరిచే అద్భుతమైన ఒక సాధనమ ని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ స భ్యులు పోతూ వేణుగోపాల్, మండల అధ్యక్షులు దుమల్ల ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి ఉపరపు శేఖర్ , ఉ పాధ్యాక్షులు గుగ్లవాత్ వసంత్, సభ్యులు పవ న్ చారి, మహేష్, సురేష్ ,రాజేందర్, నరేష్, శేఖర్ ,వెంకటేష్, సాయితేజ, అనిల్, రవి, రాకేష్, లక్మణ్ ఫోటో మరియు వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు..

# బల్లు నాయక్ తండాలో దుర్గామాత ఆలయ నిర్మాణం కొరకు భూమి పూజ



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 19 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం బల్లు నాయక్ తండా గ్రామంలో గ్రామ సర్పంచ్ జవహర్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ లావుడ్యా జవహర్ నాయక్ ఆధ్వర్యంలో దుర్గామాత గుడి నిర్మాణం కొరకు తండా ప్రజలతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జవహర్ మాట్లాడుతూ బల్లు నాయక్ తండ గ్రామంలో గ్రామ ప్రజల ఆరాధ్య దైవమైన దుర్గమాత ఆలయాన్ని నిర్మించడం సంతోషకరమన్నారు. దుర్గామాత ఆశీస్సులతో వర్షాలు బాగా కురవాలని పంటలుగా సమృద్ధిగా పండాలని ప్రజలు బాగుండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లావుడే మౌనిక తో పాటు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అటవీ ప్రాంత సంరక్షణ కోసం సమన్వయంతో కృషి చేయాలి

## జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ భవేష్ మిశ్రా



నిజామాబాద్, ఆగస్టు 19 :(విజన్ ఆంధ్ర )జిల్లాలో అటవీ ప్రాంత సంరక్షణ కోసం వివిధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో అటవీ ప్రాంత విస్తీర్ణం పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, అటవీ భూముల ఆక్రమణల నిరోధం, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై దాడులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు చేపట్టడం, వనమహోత్సవం కింద విరివిగా మొక్కలు నాటడం, జల సంరక్షణ కార్యక్రమాల అమలు, వాల్టా చట్టం అమలు, అనువైన అటవీ ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడం తదితర అంశాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

జిల్లాలో అటవీ శాఖపరంగా నెలకొని ఉన్న పరిస్థితుల గురించి జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ పాటిల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో 20 శాతానికి పైగా 86947.11 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉందని తెలిపారు. అయితే, సిరికొండ, కమ్మర్పల్లి, కాల్పోల్ తండా, డీ.బీ.తండా, చందూర్ తదితర ప్రాంతాలలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, కబ్జాదారులపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టేందుకు పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల తోడ్పాటు అవసరం ఉందని అన్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ, అటవీ ప్రాంత సంరక్షణకు ఆయా శాఖలు ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ కు తప్పకుండా తగిన సహకారం అందించేలా చూస్తామన్నారు. అటవీ భూములను కబ్జా చేస్తే కఠిన చట్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుండి ఆయా గ్రామాలలో విరివిగా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు సూచించారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం అన్ని చర్యలు చేపట్టాలని, చిరుతలు, ఇతర వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్న చోట వాహనాల వేగాన్ని నియంత్రించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అటవీ సంపద పరిరక్షణ కోసం జిల్లాలో అవసరమైన సరిహద్దు ప్రదేశాలలో చెక్ పోస్టుల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జల సంరక్షణ, భూగర్భ జల వనరుల పెంపు కోసం అటవీ ప్రాంతాలలో చెక్ డ్యాంలను నాణ్యతతో నిర్మించాలని, వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని అన్నారు. ఆర్మూర్ నగర వాటిక, నిజామాబాద్ లోని ఖిల్లా, నందిపేట లోని ఎస్సారెస్పి బ్యాక్ వాటర్ ఏరియా, అంకాపూర్ లోని మోడల్ స్కూల్ తదితర చోట్ల అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, ఏ.సీ.పీలు ప్రకాశ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, అటవీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఆర్మూర్ పట్టణంలో గృహప్రవేశంలో పాల్గొన్న పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి..

ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : ఆర్మూర్ పట్టణంలోని పెరికిట్ లో ఎల్లుల ప్రసాద్ గారి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి గారు. వారితో పాటు పాల్గొన్న ఆర్మూర్ పట్టణ మున్సిపల్ చైర్పర్సన్ గోనె లహరి రఘు గారు ఆర్మూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగరాజు గారు మాక్లూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు దయాకర్ రావు గారు కౌన్సిలర్లు సృజన్ గారు నాగేందర్ గారు ఉపేందర్ గారు మల్లయ్య గంగోలి గారు యూత్ కాంగ్రెస్ నాయకులు కలికోట శ్రీనివాస్ గారు డైరెక్టర్ శేఖర్ గారు కాంగ్రెస్ నాయకులు దామోదర్ గారు ఏలియా రెడ్డి గారు సాయినాథ్ గారు సునీల్ రెడ్డి గారు చిట్టి రెడ్డి గారు రాకేష్ రెడ్డి గారు తదితర కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు..

## నుడా చైర్మన్ జన్మదిన వేడుకలు...

బోధన్, ఆగస్టు19 (విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రంలో బుధవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు, నుడా చైర్మన్ కేశ వేణు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మందర్నా మాజీ సర్పంచ్ రావుబా గంగాధర్, సహకార సంఘం అధ్యక్షులు దేవరావు, మండల అధ్యక్షులు మేడి రవి, సాలూర సర్పంచ్ ఫోరం అధ్యక్షులు సతీష్, శంకర్, గంగన్న, శివరాజ్, అంబాదాస్, శ్రీను, రాజు, వీరేశం మారుతి, మహేష్, కోతి రాజు,సురేష్, రామ్ గౌండ, సాయిలు గంగాధర్, మహేష్ కాజా తదితరులు పాల్గొన్నారు.

# మైసంపల్లిలో మహిళా భవనానికి భూమి పూజ

నంగునూరు మండలం ఆగస్టు 19 విజన్ ఆంధ్ర : మైసంపల్లి గ్రామంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు సహకారంతో మహిళా భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలకు ఉపయోగకరంగా ఉండేలా నిర్మించనున్న ఈ భవనం ద్వారా మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, ఇతర సామాజిక కార్యక్రమాలకు సౌకర్యం కలగనుంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సోమిరెడ్డి నరేష్ రెడ్డి మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని అన్నారు. గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే హరీష్ రావు అందిస్తున్న సహకారానికి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, వీవో లీడర్లు, పిఆర్ ఏఈ పార్టీ నాయకులు,



మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. మహిళా భవనం నిర్మాణం పూర్తయితే గ్రామంలోని మహిళలకు మరింత మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# గాజులరామారంలో అభివృద్ధికి రూ.79 లక్షల నిధులు

**- మూడు కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన**

**- మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం: కూన శ్రీశైలం గౌడ్**

**- కాలనీల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచన**

గాజులరామారం, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): గాజులరామారం డివిజన్‌లోని వివిధ కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి మరో అడుగు పడింది. రూ.79 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు. శ్రీ వెంకట్ ఎంక్లేవ్‌లో రూ.38 లక్షలు, సరస్వతి ఆర్కేడ్‌లో రూ.20 లక్షలు, మెట్కన్‌గూడలో రూ.21 లక్షల చొప్పున నిధులతో ఈ పనులను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, వాటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలోని పలు కాలనీల్లో కోట్లాది రూపాయలతో అంతర్గత డ్రైనేజీలు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. గత పదేళ్ల టీఆర్ఎస్ పాలనలో



ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాల అమలులో అప్పటి పాలకులు విఫలమయ్యారని కూన శ్రీశైలం గౌడ్ విమర్శించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. గాజులరామారం పరిధిలో అభివృద్ధి పనులకు పెద్దఎత్తున నిధులు మంజూరు చేయడానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షుడు కూన శ్రీనివాస్ గౌడ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్, కాలనీ అధ్యక్షులు, సభ్యులు శ్రీధర్ గౌడ్, సోమరాజు, రాజశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, విజయ్ భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సునీల్, భూపాల్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మౌలిక వసతుల అభివృద్ధితో కుత్బుల్లాపూర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**- సంజీవయ్యనగర్‌లో రూ.45 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన**

**- ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం**

**- సీసీ రోడ్లు, తాగునీటి పైప్‌లైన్ల అభివృద్ధి**

**- భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగుపరుస్తాం**

**- పాదయాత్రలో స్థానిక సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, ఆగస్టు 19: (విజన్ ఆంధ్ర); కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. 131వ కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని సంజీవయ్యనగర్‌లో బుధవారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా సుమారు రూ.45 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు తాగునీటి పైప్‌లైన్లు, భూగర్భ డ్రైనేజీ వంటి సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ప్రజలకు నిత్యావసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.

బస్తీలపై ప్రత్యేక దృష్టి

కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని అన్ని బస్తీల్లో రానున్న రోజుల్లో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేస్తామని కేపీ.వివేకానంద్ తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. పాదయాత్ర సందర్భంగా స్థానికులను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు.



పాల్గొన్న అధికారులు, నాయకులు

ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ భద్రు, డీఈ దుర్గాప్రసాద్, ఏఈ అభిరామ్, వాటర్ వర్క్స్ మేనేజర్ రవి, కాలనీ వాసులు యాదగిరి, ఉమేష్, దాసు, మహేష్, గంగాధర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, ఎం.డి. నజీర్, నార్లకంటి బాలయ్య, రాకేష్ జాలిగం, బొంబాయి శ్రీను, రమణారెడ్డి, మహేష్, మధుకర్‌రెడ్డి, ఆంజనేయులు, కల్లెం శ్రీనివాస్, వెంకటేష్, ఖలీల్, శ్రీనాథ్, అజయ్, ప్రసాద్, దిలీప్, సెర్వి రాజ్, కోహెడ కనకయ్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ సంక్షేమ పథకాలు

## - ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘన్‌పూర్, (జనగామ) : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం చిల్పూరు మండల కేంద్రంలో 33లక్షల 60వేల అభివృద్ధి పనులు, నూతనంగా నిర్మించిన అంతర్గత సిసి రోడ్లు, ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం చిల్పూర్ మండలానికి చెందిన లబ్ధిదారులకు కొత్త డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిల్పూరు మండల కేంద్రంలోనే మండల కార్యాలయాల నిర్మాణం జరుగుతుందని త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ రెండున్నర ఏళ్లలో చిల్పూరులో 2కోట్ల 72లక్షల అభివృద్ధి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామంలో సిసి రోడ్లు, ఇందిరమ్మ ఇండ్లు, 2విపో భవనాలతో పాటు అనేక అభివృద్ధి పనులు చేసినట్లు వెల్లడించారు. చిల్పూర్ మండల కేంద్రంలో అతి త్వరలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా మంజూరు కాబోతుందని తెలిపారు. శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధితో పాటు గ్రామ గ్రామాన అభివృద్ధి పనులు చేయడమే నా ప్రధాన లక్ష్యం అని తెలిపారు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా సన్న బియ్యం పంపిణీ చేసిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం మాత్రమేనని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13వేల 800కోట్ల ఖర్చుతో కోటి 06లక్షల రేషన్ కార్డుల ద్వారా 3కోట్ల 10లక్షల మందికి ఒక్కరికి 6కిలోల చొప్పున ఉచిత సన్న బియ్యం పంపిణీ చెస్తున్నట్లు తెలిపారు. అత్యున్నత భద్రతా ప్రమాణాలతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తుందని అన్నారు. ఈ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలని బీజేపీ వాళ్ళు అంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డు బియ్యం ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల ఖర్చుతో చేపట్టే కార్యక్రమానికి మోడీ ఫోటో ఎలా పెడతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిర్ర నాగరాజు గౌడ్, సీనియర్ నేత అక్కినెపల్లి బాలరాజు, తహసీల్దార్, సర్పంచులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుకు యువతి బలి





వాజేడు,ఆగస్టు 19(విజన్ ఆంధ్ర): ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న యువతిని కట్లపాము కాటు వేయడంతో ఆ యువతి మృతి చెందిన సంఘటన వాజేడు మండలం, చింతూరు పంచాయతీ, అర్లగూడెం గ్రామంలో జరిగింది. తెలిసిన వివరాల ప్రకారం... పాయం కృష్ణారావు, జానక దంపతుల పెద్ద కుమార్తె పాయం శిరీష (25) ఇంట్లోనే ఉంటూ కిరాణా దుకాణం అమ్ముకుంటుంది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న శిరీష మంచంపై కట్లపాము చేరి, శిరీష చెవిపై కాటు వేయడంతో ఆమె గమనించి, కుటుంబ సభ్యులకు తెలిపింది. వెంటనే ఆటోలో ఏటూరునాగారం ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో 108 వాహనంలో ములుగు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు శిరీష మృతి చెందినట్లు తెలిపారు. కూతురి మరణంతో ఆ తల్లితండ్రులు ఏడుస్తున్న తీరు చూస్తే.. అక్కడ ఉన్న వారందరి మనసులు కరిగిపోయాయి. అర్లగూడెం గ్రామంలో శిరీష మరణ వార్త విని విషాదఛాయలు అలుముకున్నాయి

# ఆదివాసీ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం

## - గాదిగూడ మండల వ్యాప్తంగా సంపూర్ణ బంద్ విజయవంతం

గాదిగూడ,ఆగస్టు 19(విజన్ ఆంధ్ర):ఆదివాసీల హక్కులు,సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాలని తుడుందెబ్బ మండల అధ్యక్షులు మాడావి చంద్రహరి,ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పెందోర్ సంతోష్ పిలుపునిచ్చారు.తుడుందెబ్బ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఏజెన్సీ బంద్ ను బుధవారం ఉమ్మడి గాదిగూడ మండల వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేట్, పాఠశాలలు మార్కెట్ దుకాణాల వ్యాపారస్తులు సంపూర్ణ బంద్ పాటించారు.ఆదివాసీ అనుబంధ సంఘాలను మరింత బలోపేతం చేసి,గిరిజనుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేయాలని వారు అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆదివాసీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు,ఉపాధి తదితర మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.ఆదివాసీ యువత విద్యతోపాటు సామాజిక,హక్కుల ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకోవడానికి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షులు మరప గంగారాం,మాజీ ఎంపీటీసీ సిడాం నాగోరావ్,మెస్రం సంతోష్,కొడప జంగు,కొడప లింగు,హేరేకుంరా దేవురావ్,కుంరా భీంరావ్,మెస్రం ధర్ముతో పాటు ఆదివాసీ అనుబంధ సంఘాల నాయకులు,ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా శ్రీ మహాలక్ష్మి అష్టోత్తర శతనామావళి భాష్యం పుస్తకావిష్కరణ

హైదరాబాద్ డెస్క్ (విజన్ ఆంధ్ర) ఆగస్టు 19 బుధవారం : శ్రావణ మాసపు మొదటి వారం సందర్భంగా సాయంత్రం 5:00జూవి గంటల సమయంలో భాష్య కర్త భార్గవీ దేవి బూదరాజు దీూ.పీూ.వీ.జుణ ప్రముఖ ఆధ్యాత్మిక జ్యోతిష్య వేత్త ఆధ్వర్యంలో చిత్తారమ్మ గుడి ప్రాంగణంలో, వివేక్ నగర్. కూకట్ పల్లి హైదరాబాద్ జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బ్రహ్మశ్రీ పద్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ వీూ్యాం.ఱ. చేతల మీదుగా శ్రీ మహాలక్ష్మి అష్టోత్తర శతనామావళి భాష్యం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జి హరినాథ్ టిటిడి, విశ్వేశ్వర్ (భగవద్గీత), శ్రీ రవణం స్వామి నాయుడు ఎ.శీ.శీ. చిరంజీవి బ్లడ్ బ్యాంక్, పులగం చిన్నారాయణ. సినీ రచయిత, విఎన్ ఆదిత్య సినీ డైరెక్టర్, రేవూర్ పద్మనాభ రావు. విశ్రాంతి అదనపు డైరెక్టర్ జనరల్ దూరదర్శన్ ఢిల్లీ, బివిఎల్ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# పాత వీడియోతో కొత్తగా ఎడిట్ చేసి నిన్నటి ఘటనగా చిత్రీకరణ

## కాంగ్రెస్ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా : మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మి నారసింహ రావు

భూపాలపల్లి జిల్లా ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర ) తనకు సంబంధించిన పాత వీడియోను ఎడిట్ చేసి, అది నిన్న జరిగిన ఘటనగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంపై మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు మండిపడ్డారు.భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్‌కు చెందిన ఐఎన్సీ భూపాలపల్లి ( ఐ ఎన్ సీ బిభూపాలపల్లి ) ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో వాస్తవాలను వక్రీకరిస్తూ వీడియోను పోస్టు చేశారని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగతంగా తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు.మార్చి 10న యూనివర్సిటీ క్రాస్ సమీపంలో ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి తన కారును ఢీకొట్టి ఆపకుండా వెళ్లేందుకు ప్రయత్నించారని తెలిపారు. వారిని అడ్డుకునే క్రమంలో జరిగిన వివాదంలోని కొంత భాగాన్ని మాత్రమే తీసుకుని వీడియోగా ప్రచారం చేశారని పేర్కొన్నారు.ఈ ఘటనపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైందని, కేసు





ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని స్పష్టం చేశారు. తాను రమణారెడ్డి అనుచరుడినేనే విషయాన్ని బహిరంగంగానే చెబుతున్నానని, తన రాజకీయ జీవితంలో మొదటి నుంచి ఆయనతోనే ఉన్నానని తెలిపారు.పేదలు, ప్రజలకు సేవ చేయడం, రాజకీయాల్లో నిబద్ధతతో ఉండటం వంటి విలువలను ఆయన నుంచి నేర్చుకున్నామని పేర్కొన్నారు. తమ నాయకుడి పేరును ప్రస్తావిస్తూ తప్పుడు ప్రచారం చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని అన్నారు.ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే తమపై, తమ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టడం, ఆరోపణలు చేయడం పరిపాటిగా మారిందని ఆరోపించారు. గణపురం ప్రాంతంలోని వంతెన నిర్మాణం, చెరువుకు నీటి విడుదల వంటి సమస్యలపై తాము ప్రజల తరపున ప్రశ్నించామని తెలిపారు.

ప్రజా ఒత్తిడి, తమ పోరాటం తర్వాతే సంబంధిత సమస్యలపై ప్రభుత్వం స్పందించిందని పేర్కొన్నారు. పాత ఘటనలను కొత్తవిగా చూపిస్తూ వీడియోలను ఎడిట్ చేసి ప్రచారం చేయడం మానుకోవాలని హెచ్చరించారు.

రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వ్యక్తిగతంగా కించపరిచేలా తప్పుడు వీడియోలు ప్రచారం చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో గణపురం, భూపాలపల్లి నాయకులు,పట్టణ మాజీ అధ్యక్షులు కటకం జనార్దన్,మాజీ మండల అధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి,జిల్లా నాయకులు సెగ్గెం సిద్దూ, మాడ హరీష్ రెడ్డి, పిన్నింటి శ్రీనివాస్‌రావు,సింగనవేణి చిరంజీవి, మాజీ కౌన్సిలర్ మురళీ హఫీజ్, గాజర్ల చింటూ గౌడ్, మామిండ్ల సాంబయ్య, పిన్నింటి మణిదీప్‌రావు,మహేందర్,పబ్బ రవీందర్, మార్క సాయిగౌడ్, వాజీత్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలాలికి సీపీఎం నేతల నివాళి

వీపనగండ్ల, ఆగస్టు 19 విజన్ ఆంధ్ర న్యూస్ : వీపనగండ్ల: మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన సీపీఎం పార్టీ సానుభూతిపరుడు మౌలాలి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి సీపీఎం వనపర్తి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. జబ్బార్, మండల కార్యదర్శి డి. బాల్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మౌలాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మౌలాలి భౌతికకాయానికి నివాళు లర్పించి విప్లవ జోహార్లు అర్పించారు.నివాళులర్పించిన వారిలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు మండ్ల కృష్ణయ్య, మహబూబ్ పాషా, మండల నాయకులు సి. హెచ్. వెంకటయ్య, ఆశన్న, ఎల్ఐసీ వెంకటస్వామి, రవి, ఎం. ఆది, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

### మిడ్జిల్ మండల ఫోటో గ్రాఫర్స్ సంఘం

మిడ్జిల్,19 ఆగస్ట్ విజన్ ఆంధ్ర : మిడ్జిల్ మండల కేంద్రంలో..బుధవారంలిరాష్ట్ర అధ్యక్షుడు,జిల్లా అధ్యక్షులు ఆదేశాల మేరకు మిడ్జిల్ మండల కేంద్రంలో లి అధ్యక్షులు పాపకంటి మహేష్ నూతన జెండా ఎగరవేయడం జరిగింది అనంతరం ఆయన మాట్లాడుతూ ""చిత్రలేఖన రంగానికి జీవం పోసి, ఆధునిక కెమెరా సాంకేతికతకు బాటలు వేసిన దృశ్య విప్లవకారుడు లూయిస్ డాగ్యురే లి చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి మిడ్జిల్ మండల్ గ్రామ సర్పంచ్ శంకర్, సంఘ ఉ పాధ్యక్షులు మాబిన్, ప్రధాన కార్యదర్శి బాలు, కోశా ధికారి కళ్యాణ్ చక్రవర్తి,కుటుంబ భరోసా ఇన్చార్జి నాగరాజు, లికార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, సురేష్, కృష్ణ గౌడ్, మాకుసుధ్, సందీప్, రాజు, రావి, సుకుర్, అంజి రాజు తదితరులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మోహన్‌రావు పాటిల్

నారాయణ్ ఖేడ్ ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : నారాయణ్ ఖేడ్ మండలం ...



గ్రామ సర్పంచ్ తండ్రి కదం మురళి పాటిల్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మురళి పాటిల్ మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉ ండాలని సూచిస్తూ వారికి మనోధైర్యం కల్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి జిల్లాలో కల్తీ ఆహార వస్తువుల పై కొరవడిన పర్యవేక్షణ

భూపాలపల్లి జిల్లా ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర ) జిల్లాలో ప్రజలు నిత్యం వినియోగించే పాలు, పాల పదార్థాలు, నూనెలు, పప్పులు, మసాలాలు, కారం, పిండి పదార్థాలు, మిఠాయిలు, బేకరీ ఉత్పత్తులు, కూరగాయలు, పండ్లు, మాంసం తదితర ఆహార పదార్థాల నాణ్యతపై సమర్థవంతమైన పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కల్తీ, నకిలీ, నాణ్యతలేని ఆహార పదార్థాల విక్రయాలపై తరచూ తనిఖీలు నిర్వహించి, నమూనాలను సేకరించి పరీక్షించాల్సిన అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉ ంది. ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అంశం కావడంతో కల్తీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

నార్నూర్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా బాలికల అభివృద్ధి అధికారి (+జబూ) మెస్రం ఛాయ సూచించారు. గురువారం నార్నూర్ మండలంలోని మన్కపూర్,జమడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమై ఆరోగ్యం, పరిశుభ్రత, విద్యపై అవగాహన కల్పించారు.

**పరిశుభ్రతతోనే ఆరోగ్యం..**

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. మరిగించిన నీటిని తాగాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. జ్వరం, జలుబు, దగ్గు తదితర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థినుల ఆరోగ్య రికార్డులను పరిశీలించి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆరోగ్య పరీక్షలు, పోషకాహారం అందుతున్న తీరును తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు.విద్యే ఆయుధంగా ముందుకు సాగాలి ఆడపిల్లలు విద్యనే ఆయుధంగా భావించి కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని మెస్రం ఛాయ అన్నారు. మహిళలకు ప్రస్తుతం విద్య, ఉపాధి, పరిపాలన, సాంకేతిక రంగాల్లో అనేక అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థినులకు సూచించారు.

**సంక్షేమానికి ప్రాధాన్యం**

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల విద్యా ప్రగతి, వసతి, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు.

# మిషన్ భగీరథ పైప్‌లైన్ ఇవ్వాలని ఖాళీ బిందెలతో హనుమాన్‌బస్తీ మహిళల నిరసన

బెల్లంపల్లి ఆగస్టు 19 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి పట్టణం లోని 28వ వార్డు హనుమాన్‌బస్తీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బస్తీ మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో నిరసన చేశారు .

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను వన్‌టౌన్ వెనుక గల్లీకి మాత్రం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. పైప్‌లైన్ కోసం గతంలో గల్లీలో తవ్వకాలు చేపట్టి పనులు పూర్తి చేయకుండా వదిలివేయడంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

సమస్యపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. తవ్విన గుంతలను సైతం తమ సొంత ఖర్చులతో పూడ్చుకున్నామని తెలిపారు. వెంటనే పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.



నిరసనలో పసులేటి వెంకటేష్, చేను విజయ, మాటేటి రాజ్యలక్ష్మి, మాటేటి రాధ, పసులేటి రాధ, ముదురకోళ్ల రాజవ్వ, లావణ్య, ఖమ్మం భూదేవి, నాగిశెట్టి రాణి, నాగిశెట్టి రమా, ఇప్పకాయల రాజేశ్వరి, కలగనూరి సరిత, మాటేటి స్వరూపతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

# అల్యూమినియం ప్యానళ్ల చోరీ కేసు ఛేదింపు

**- ఐదుగురు నిందితుల అరెస్ట్**

**- చోరీ సొత్తు, రెండు వాహనాలు, మొబైల్ ఫోన్ స్వాధీనం**

చౌటకూర్ ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర ): పుల్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న తెలంగాణ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రాంగణంలో జరిగిన అల్యూమినియం ప్యానళ్ల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.కేసు వివరాలు: ఆగస్టు 9న అర్ధరాత్రి సుమారు రూ.85 వేల విలువైన 45 అల్యూమినియం ప్యానళ్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. 'సాయి పవని కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్' హెచ్ఆర్ జగదీష్ వర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ నంబర్ 129/2026, బీఎన్ఎస్ సెక్షన్ 303(2) కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

యూపీఐ లావాదేవీ ఆధారంగా గుర్తింపు:

ఘటనా స్థలం పరిసరాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించిన పోలీసులు, చోరీ సొత్తుతో కూడిన ట్రాలీ వాహనం సంగారెడ్డి వైపు వెళ్లినట్లు గుర్తించారు. మార్గమధ్యలో టోల్‌గేట్ రుసుమును ఫోన్‌పే (యూపీఐ) ద్వారా చెల్లించడంతో, ఆ లావాదేవీ ఆధారంగా నిందితుల మొబైల్ నంబర్లను గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు.సుమారు 12 రోజుల క్రితం సింగూర్ డ్యామ్ సందర్శించి తిరిగి వెళ్లే క్రమంలో స్కూల్ వద్ద ఉన్న ప్యానళ్లను గమనించామని, సులభంగా డబ్బు సంపాదించేందుకే ఈ చోరీకి పాల్పడ్డామని నిందితులు విచారణలో అంగీకరించారు. ప్రధాన నిందితుడు మరాటి ప్రకాష్‌పై గతంలో



కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో చోరీ కేసు నమోదై ఉందని పోలీసులు వెల్లడించారు.

అరెస్టయిన నిందితులు:

మరాటి ప్రకాష్ (20), చరప్ల సతీష్ (33), నానంపేట అనిల్ (21), గోసావి రామచంద్ర (29), చరప్ల గోపాల్ (21)

స్వాధీనం చేసుకున్న సొత్తు:

45 అల్యూమినియం ప్యానళ్లు (విలువ రూ.85,000)

మహీంద్రా సుప్రో ప్రాఫిట్ ట్రక్ (టిఎస్+15-ఖ-5805)

హోండా యాక్టివా (ఏపీ02-జుం-3502)

రెనో 10 ప్రో 5+ మొబైల్ ఫోన్

నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు జోగిపేట సీఐ డి. అనిల్ కుమార్, పుల్కల్ ఎస్సై ఎన్. విశ్వజన్ తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# చివరి ఆయకట్టు వరకు జూరాల నీరు ఇవ్వాలి

**- ఎరువులు, పురుగుమందుల ధరలు తగ్గించాలి**

**- ఆగస్టు 20న కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయండి**

**-సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. జబ్బార్**



వీపనగండ్ల, ఆగస్టు 19 విజన్ ఆంధ్ర: వీపనగండ్ల వానాకాలం వరి సాగుకు జూరాల ప్రాజెక్టు నుంచి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. జబ్బార్ డిమాండ్ చేశారు. వీపనగండ్ల మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం ఎం. కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జబ్బార్ మాట్లాడుతూ.. జూరాల ప్రాజెక్టు పరిధిలో వరి సాగు చేయవద్దని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నప్పటికీ ఇప్పటికే పలువురు రైతులు వరి నాట్లు వేశారని తెలిపారు. ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి వరద నీరు వస్తున్న నేపథ్యంలో రైతుల్లో సాగుపై ఆశలు చిగురిస్తున్నాయని పేర్కొన్నారు. చివరి ఆయకట్టు వరకు నీరు అందించి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సింగోటం నుంచి గోపాల్‌దిన్నె రిజర్వాయర్ వరకు లింక్ కెనాల్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. దీంతో వీపనగండ్ల, చిన్నంబావి ప్రాంతాల రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగుతాయని అన్నారు. రైతులను దగా చేస్తున్న కేంద్రం కేంద్ర ప్రభుత్వం ఎరువులు, పురుగుమందుల ధరలను పెంచుకునేందుకు కంపెనీలకు అనుమతులు ఇవ్వడం ద్వారా రైతులపై భారం మోపుతోందని జబ్బార్ విమర్శించారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతుల సమస్యలపై ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నిరుద్యోగుల సమస్యలపై ధర్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పట్టించుకోకుండా మాటలకే పరిమితమవుతున్నాయని జబ్బార్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, ఉద్యోగ నోటిఫికేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 20న అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్‌ల ఎదుట నిర్వహించే ధర్నాలో నిరుద్యోగులు, యువత పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. జబ్బార్, మండల కార్యదర్శి డి. బాల్‌రెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు మండ్ల కృష్ణయ్య, రవి ప్రసాద్, శాంతమ్మ, మండల కమిటీ సభ్యులు వీ. కృష్ణయ్య, బాలగౌడ్, సి. హెచ్. వెంకటయ్య, ఆశన్న, ఈశ్వర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచఫోటోగ్రఫీ దినోత్సవం

కొత్తకోట ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): కొత్తకోట: ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను కొత్తకోట ఫోటోగ్రఫీ అసోసియేషన్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రాఫర్ల జండా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తకోట ఎస్సై విక్రమ్, వైజాగ్ కొత్తకోట వైద్యాధికారి ఆసియా బేగం జెండావిష్కరణ చేశారు. పట్టణ చౌరస్తాలో ఫోటోగ్రాఫర్లు బాణాసంచ కాల్చి సంబరాలు జరుపుకొని మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బెడ్లు పండ్ల పంపిణీ చేశారు.

తోటి ఫోటోగ్రాఫర్ కు చేయూత

తోటి ఫోటోగ్రాఫర్ కు రామస్వామికి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతూ విషయం తెలుసుకున్న సాటి కొత్తకోట ఫోటోగ్రాఫర్ సభ్యులు ఆయన పరామర్శించి రూ. 5100 రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కొత్తకోట సంఘం నాయకులు అల్లావుద్దీన్ మాట్లాడుతూ.. తోటి ఫోటోగ్రాఫర్లు కు ఆపదలో ఉన్న వారికి వారికి చేనేత ఇస్తూ సంఘం తరపున ఆర్థిక సాయం అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఫోటో సీనియర్ ఫోటోగ్రాఫర్స్ సలాం మాజీ అధ్యక్షులు బాలరాజు, నాగన్న సాగర్, కుమ్మరి శ్రీనివాసులు, అంజన్న గౌడు, చీర్ల యాదయ్య సాగర్, మాజీ ఉపాధ్యక్షులు రాములు, ఉపాధ్యక్షులు, రమేష్ చారి, కోశాధికారి, భూపాల్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, కార్యదర్శులు అశోక్, రవి,

## కొత్తూరు శంకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

కుబీర్, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): వర్షాకాలంలో వ్యాప్తి చెందుతున్న వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో కుబీర్ మండలంలోని పార్డీ--బి గ్రామంలో గ్రామ సర్పంచ్ మడి ప్రవీణ్ అధ్యక్షతన, కొట్టూర్ శంకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి సుమారు 300 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, మధుమేహం, ఎయిడ్స్ తదితర వ్యాధులకు సంబంధించిన రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు, వర్షాకాలంలో వచ్చే విషజ్వరాలను గుర్తించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. చిన్నారులకు అవసరమైన టీకాలు కూడా వేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి భూమేష్, డాక్టర్ విజేష్ కుమార్, ఖలీం, ఇమ్రాన్, సుగుణ, విలాస్, సురేఖ, ఆశా కార్యకర్తలు,



గ్రామ వార్డు సభ్యులు శ్రీనివాస్, సాయి నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్వాసనతో కంపు కొడుతున్న కొత్తకోట ఆర్టీసీ బస్టాండ్

కొత్తకోట ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): కొత్తకోట :ఆర్టీసీ బస్టాండు నిత్యము దుర్వాసన వెదజల్లడంతో బస్టాండ్ ఆవరణ అంతా కంపు కొడుతూ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని సిపిఎం మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ ఆరోపించారు బుధవారం నాడు బస్టాండ్ ఆవరణలో పరిశీలించగా దుర్వాసన కంపుతో నిండిపోయిందని ఆయన చెప్పారు అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నట్లుగా బస్టాండు తీరు ఉంది బస్టాండ్ మొత్తం కూడా 13 షాపులకు కిరాయి మొత్తం నెలకు 4 లక్షల,20,000 ఆర్టీసీకి ఆదాయం వస్తుంది సంవత్సరానికి 10 లక్షల రూపాయలు కొత్తకోట ఆర్టీసీ నుండి ఆదాయం ఉంది అయినా మూత్రశాలలు మరుగుదొడ్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు సతమతమవుతున్నారు నిత్యము కర్నూల్ రాయలసీమ అలంపూరు గద్వాల వనపర్తి హైదరాబాదు దూర ప్రాంతాల నుండి స్థానికులు ఇక్కడికి చేరుకొని వెళ్తుంటారు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం ఉన్నదని ఆయన విమర్శించారు 1978 సంవత్సరంలో ఆగస్టులో ప్రారంభించబడింది 49 సంవత్సరాలు కావస్తున్నాయి అయినా ప్రయాణికులకు సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నారు తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేకపోయింది



విశాలమైన బస్టాండ్ ఉన్న ప్రయాణికుల కావాల్సిన సౌకర్యం లేక మరుగుదొడ్లు మూత్రశాలలు దగ్గరికి వెళ్తే దుర్వాసన వెదజల్లుతుంది ఖాళీ స్థలంలో అనేకులు ప్రయాణికులు మూత్ర విసర్జన చేయడం ద్వారా బస్సులు కొరకు వేచి ఉంటున్న ప్రయాణికులు దుర్వాసనకు సొమ్మసిల్లి పోతున్నారు వర్షం వస్తే చాలు బస్టాండ్ లో పో ట్టుకు పెడుతుంది ప్రయాణికులు బస్టాండులో గొడుగులు పట్టుకుని నిలబడే పరిస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు వెంటనే బస్టాండ్ లో ఉన్న ఖాళీ స్థలంలో మరుగుదొడ్లు మూత్రశాలలు నిర్మాణం చేపట్టాలని లేని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమానికి నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు

## ఎస్ఐఆర్--2026లో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాపై నోటీసుల జారీ,

మహబూబ్‌నగర్: ఎస్ఐఆర్--2026లో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాపై నోటీసుల జారీ, తదుపరి చర్యలకు సంబంధించి యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబ్ నగర్ జిల్లా నుండి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్నారు. ఎస్ఐఆర్--2026 ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం చేపట్టాల్సిన చర్యలు, నోటీసుల జారీ, పెండింగ్‌లో ఉన్న అంశాల పరిష్కారం, తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సంబంధించిన కార్యాచరణపై ఈ సందర్భంగా చర్చించారు. ఎస్ఐఆర్--2026 ముసాయిదా ఓటర్ల జాబితాలో 6,29,402 మంది ఓటర్లు

మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్ఐఆర్--2026 కింద రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం 6,29,402 మంది ఓటర్లు ఉన్నారు. ఆగస్టు 17, 2026 నాటికి మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలను అధికారులు సమీక్షించారు.

ముసాయిదా జాబితా ప్రకారం మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 2,13,588 మంది, జడ్చర్లలో 1,99,354 మంది, దేవరకద్రలో 2,16,460 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం సాధారణ ఓటర్లలో 3,13,256 మంది పురుషులు, 3,16,107 మంది మహిళలు, 19 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. అదనంగా 20 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు నమోదయ్యారు.

నోటీసులు, తుది జాబితా ప్రక్రియపై దృష్టి

ముసాయిదా ఓటర్ల జాబితాలో 40,116 మంది ఓటర్ల నో మ్యాపింగ్ ఉండగా, 1,96,576 లాజికల్ డిస్క్రెపెన్సీలు గుర్తించారు.

నియోజకవర్గాల వారీగా మహబూబ్‌నగర్‌లో 19,487, జడ్చర్లలో 8,759, దేవరకద్రలో 11,870 మంది మ్యాపింగ్ పెండింగ్‌లో ఉంది. అదేవిధంగా లాజికల్ డిస్క్రెపెన్సీలు మహబూబ్‌నగర్‌లో 69,951, జడ్చర్లలో 60,961, దేవరకద్రలో 65,664గా నమోదయ్యాయి. వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. బీఎల్ఓల నియామకం, డేటా అప్‌డేషన్ పూర్తి చేయాలని అన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో గతంలో 846 మంది బీఎల్ఓలు/పీఎస్ సిబ్బంది ఉండగా, కొత్తగా 16 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడంతో ఈ సంఖ్య 862కు చేరింది.

జు–నా లను దీూా ల ట్రైనింగ్ కోసం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న మ్యాపింగ్, లాజికల్ డిస్క్రెపెన్సీలు, బీఎల్ఓల అప్‌డేషన్, సమావేశాల మినిట్స్‌ను త్వరితగతిన పూర్తి చేసి, తుది ఓటర్ల జాబితా ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.వి. హరిప్రియ, ఆర్డీఓ నవీన్, ఎలక్షన్ ఇు అధికారి జాఫర్, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరామ్ తదితరులు పాల్గొన్నారు.




## లింగాపూర్ మండలం సంపూర్ణంగా బంద్

ఆదివాసీ గిరిజనుల75శాతం రిజర్వేషన్ కల్పించాలని తుడుం దెబ్బ మండల అధ్యక్షులు అర్కా సుదర్శన్ డిమాండ్ : లింగాపూర్ ఆగస్టు 19(విజన్ ఆంధ్ర )గిరిజన నిరుద్యోగులకు పోలీస్ కానిస్టేబుల్ నియామకాల లో 75% అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ తుడుం దెబ్బ నాయకులు బుధవారం లింగాపూర్ లో బంద్ సంపూర్ణ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బమండల నాయకులుఅర్కా సుదర్శన్,మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నిరుద్యోగ యువతీ యువకులకు ప్రత్యేక నియమక అవకాశాలు కల్పించాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు పాల్గొన్నారు.

# "అక్రమ ఇసుక దందాకు చెక్"

**-"తెల్లవారు జామున టిప్పర్ పట్టుకున్న కల్వకుర్తి పోలీసులు"**

**-"డ్రైవర్ అరెస్ట్ - వాహనం సీజ్"**

-కల్వకుర్తి, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 19 : జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్, డిఎస్పి వెంకట్ రెడ్డి,సిఐ బీమ్ కుమార్ ఆదేశాల మేరకు అక్రమ ఇసుక తరలింపుపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తెల్లవారు జామున ఉప్పునుంతల మండలం దాసర్లపల్లి గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను కల్వకుర్తి ఎస్సై కురుమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు.

రఘుపతిపేట శివారులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వచ్చిన టిప్పర్‌ను ఆపి విచారించారు. వాహనంలో అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా ఎస్సై కురుమూర్తి మాట్లాడుతూ అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్న వారిపై నిరంతరం నిఘా ఉంచామని తెలిపారు. పట్టుబడిన టిప్పర్ డ్రైవర్ పై అక్రమ ఇసుక తరలింపు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిని ఎంతటి వారైనా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.

గత కొంతకాలంగా ఉప్పునుంతల, కల్వకుర్తి పరిసర ప్రాంతాల నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక తరలింపు జరుగుతుందన్న సమాచారంతో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇందులో భాగంగానే బుధవారం తెల్లవారు జామున ఈ టిప్పర్ పట్టుబడినట్లు పోలీసులు వెల్లడించారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమంగా సహజ వనరులను తరలిస్తున్న వారిపై ఇలాంటి దాడులు కొనసాగుతాయని, ప్రజలు కూడా ఇలాంటి అక్రమాలను గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కురుమూర్తి విజ్ఞప్తి చేశారు.

## ప్రాణాలను కాపాడిన హెల్మెట్ -ఒకరికి తీవ్రగాయాలు

ముధోల్:19ఆగస్టు, విజన్ ఆంధ్ర ముధోల్ :మండల కేంద్రంలోని హెచ్ పీ పెట్రోల్ బంక్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలు కాగా హెల్మెట్ ధరించడంతో ప్రాణాలు బయటపడ్డాయి. ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ నుండి ముధోల్ కు వస్తున్న ఆర్టీసీ బస్సు,బాసర నుండి ముధోల్ కు వస్తున్న ద్విచక్ర వాహనం హెచ్ పీ పెట్రోల్ బంక్ మూల మలుపు వద్ద వెనక నుండి బస్సును ఢీకొంది.దీంతో మహారాష్ట్ర లోని బిలోలి తాలూకా లోహేగావ్ గ్రామానికి చెందిన ఆనంద్ కు ఎడమ కాలు విరిగింది. దీంతో 108 అంబులెన్స్ భైంసా ఏరియాకు తరలించారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# గృహావసరాల సబ్సిడీ డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు బహిరంగంగా బ్లాక్ లో అమ్మకం?

**అధిక ధరలకు అమ్ముతున్న గ్యాస్ డెలివరీ బాయ్ లు**

**చర్యలు తీసుకోవాలని అధికారులకు ప్రజల విన్నపం**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ప్రత్యేక కథనం ఆగస్టు 19 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రాంతంలో పేద కుటుంబాల గృహ అవసరాల కొరకు కేటాయించిన డొమెస్టిక్ గ్యాస్ సబ్సిడీ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. పేదల గ్యాస్ డొమెస్టిక్ సిలిండర్లు బహిరంగంగా గ్యాస్ కంపెనీల డెలివరీ బాయిలే హుస్నాబాద్ మార్కెట్లో 1600 నుంచి ఆపైన అమ్ముతున్నారు. వివరాలు లోకి వెళితే హుస్నాబాద్ ప్రాంతంలో వాయుపుత్ర గ్యాస్ ఏజెన్సీ మరియు అక్కన్నపేట మండలం నందారం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వారి గ్యాస్ ఏజెన్సీల నుండి ప్రతిరోజు దాదాపు 20కి పైగా గ్యాస్ డెలివరీ వాహనాలు గ్యాస్ గోదాం నుండి ఇంటింటికీ సిలిండర్లు సరఫరా చేస్తుంటారు.ఇరాన్ అమెరికా యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరత కారణంగా కేంద్ర ప్రభుత్వం ఒకసారి బుక్ చేస్తే మళ్లీ 45 రోజుల వరకు బుక్ చేయరాదు అనే నిబంధనలు విధించడంతో వాణిజ్య అవసరాలకు హోటళ్లలో ఇండ్లలో గ్యాస్ కొరత ఉన్నవారికి బహిరంగంగా 1600 నుంచి రెండు వేయిల వరకు అమ్ముతున్నారు. ప్రభుత్వాలు విధించిన ఈ నిబంధనలతో ఈ అవకాశం పేదలకు శాపంగా మారితే గ్యాస్ ఏజెన్సీలకు మాత్రం కాసుల పంటగా మారింది. కొన్ని దుకాణాలలో కూడా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు బహిరంగంగా అమ్ముతున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని రోజుల కిందట పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ ఈ వ్యాపారం మాత్రం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీ 500 రూపాయలకు ఇస్తున్నందున కనెక్షన్ ఉన్నవారి వద్ద వివరాలు సేకరించి గ్యాస్ ఎవరు బుక్ చేయడం లేదు అనేది తెలుసుకొని వారిని బుక్ చేయించి బహిరంగంగా బ్లాక్ లో అమ్ముతున్నారని ఆరోపణలు ఉన్నాయి. వాస్తవంగా అధికారులు విచారణ జరిపిస్తే ఈ కుంభకోణంలో గ్యాస్ ఏజెన్సీల మరియు డెలివరీ బాయ్ ల పాత్ర మొత్తం బయటికి వస్తుంది.ఇవన్నీ తెలిసిన అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోదాం నుండి ఎన్ని సిలిండర్లు బయటికి వస్తున్నాయి వాస్తవముగా ఎంత మంది బుక్ చేస్తున్నారు బుక్ చేసిన సిలిండర్లు వాళ్ళు బుక్ చేసిన వారికి వెళ్తున్నాయా బయట మార్కెట్లో అమ్ముతున్నారా మొత్తం విచారణ చేయాలని, బ్లాక్ లో అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# పెద్దవేడు గ్రామంలో నూతన పాఠశాల, అంగన్వాడీ భవనాల ప్రారంభం

**- విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ..**

**- గ్రామీణ విద్యాభివృద్ధికి అమెజాన్ సంస్థ సహకారం**

షాబాద్, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : షాబాద్ మండలం పెద్దవేడు గ్రామంలో విద్యాభివృద్ధికి మరో ముందడుగు పడింది. గ్రామ సర్పంచ్ చక్కటి రాజ సులోచన ఆధ్వర్యంలో అమెజాన్ సంస్థ, నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం, అంగన్వాడీ భవనాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్యతో కలిసి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి నూతన భవనాలను ప్రారంభించారు.గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు చిన్నారులకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో అమెజాన్ సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంది. ఇప్పటివరకు ఉన్న వసతులతో పోలిస్తే నూతన భవనాల ద్వారా విద్యార్థులకు, అంగన్వాడీ చిన్నారులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడనుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో విద్యకు సంబంధించిన మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎంతో ముఖ్యమన్నారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు మెరుగైన భవనాలు అందుబాటులో ఉండటం వల్ల విద్యార్థులు, చిన్నారులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రభుత్వంతో పాటు వివిధ



సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో విద్య, చిన్నారుల సంక్షేమం కోసం ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ...అమెజాన్ సంస్థ పెద్దవేడు గ్రామంలో పాఠశాల, అంగన్వాడీ భవనాల నిర్మాణానికి సహకరించడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకుందని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

లవిద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీల

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యలో వినియోగించుకునేలా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ చేపట్టడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. డిజిటల్ విద్యకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ల్యాప్‌టాప్‌లు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

నూతన పాఠశాల భవనం, అంగన్వాడీ కేంద్రం అందుబాటులోకి రావడంతో గ్రామంలోని విద్యార్థులు, చిన్నారులకు మెరుగైన వసతులు లభించనున్నాయి. పాఠశాల పరిసరాలు విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా వారి విద్యాభ్యాసానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని అధికారులు తెలిపారు.

నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, అమెజాన్ సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామంలో నూతన పాఠశాల, అంగన్వాడీ భవనాలు ప్రారంభం కావడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేయడం కూడా గ్రామీణ విద్యార్థులకు డిజిటల్ విద్యను చేరువ చేసే మంచి ప్రయత్నమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ జోనల్ మేనేజర్ జ్యోతి, ఎమ్మార్వో అన్వర్, ఎంపీడీవో అపర్ణ, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, కోపరేటివ్ డైరెక్టర్ చక్కటి దేవేందర్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటరెడ్డి, సర్పంచులు, అమెజాన్ సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం...

బోధన్, ఆగస్టు19 (విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణ స్టూడియో అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఫోటోగ్రాఫర్లు, ఫోటో స్టూడియోలు, వీడియో ప్రతినిధులు, ఫోటోగ్రఫీ ప్రియులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి సీనియర్లకు శాలువాతో సన్మానించారు. అనంతరం చింతకుంట వృద్ధాశ్రమంలో నిత్యావసర వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మురళి కటికల, ఉపాధ్యక్షులు శంకు గణేష్, కార్యదర్శి అనీల్ రెడ్డి, సహాయ కార్యదర్శులు ఎర్ర శ్రీకాంత్, మల్లెపూల భాస్కర్, కోశాధికారి ఉమాకాంత్, మధు, గౌరవ అధ్యక్షులు అనీల్ గౌడ్, ప్రభాకర్, అశోక్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

## నానో యూరియా, నానో డీఏపీపై రైతులకు అవగాహన

బెల్లంపల్లి ఆగస్టు 19 విజన్ ఆంధ్ర: కాసిపేట మండలంలోని కాసిపేట గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులకు క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పంట క్షేత్ర ప్రదర్శన చేపట్టి నానో ఎరువుల వినియోగ విధానం, పంటలకు అవసరమైన పోషక యాజమాన్యంలో వాటి పాత్ర, సరైన పంట దశలో వినియోగించాల్సిన పద్ధతులను రైతులకు వివరించారు. నానో యూరియా ద్వారా పంటకు అవసరమైన నత్రజని పోషకాన్ని సమర్థవంతంగా అందించడంతో పాటు ఆకుపచ్చదనం, మొక్కల ఎదుగుదలకు తోడ్పడుతుందని తెలిపారు. ఆకులపై పిచికారీ చేయడం ద్వారా పోషకాల వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని వివరించారు. నానో డీఏపీ పంటకు అవసరమైన నత్రజని, భాస్వరం పోషకాలను అందించడంతో పాటు వేర్ల అభివృద్ధి, మొక్కల ప్రారంభ ఎదుగుదలకు సహాయపడుతుందని పేర్కొన్నారు.

నానో యూరియా, నానో డీఏపీలను సంప్రదాయ ఎరువులకు పూర్తిస్థాయి ప్రత్యామ్నాయంగా కాకుండా సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా వినియోగించాలని రైతులకు సూచించారు. పంటకు సిఫారసు చేసిన దశలో, సూచించిన మోతాదులో ఆకులపై పిచికారీ చేయాలని, ఇతర ఉత్పత్తులతో కలిపి వినియోగించే ముందు సంబంధిత సాంకేతిక సిఫారసులను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సీహెచ్. ప్రభాకర్, వ్యవసాయ విస్తరణ అధికారి సాగర్‌తో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఫోటోగ్రాఫర్లకు సబ్సిడీ రుణాలు అందించాలి

- పేటలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ డే వేడుకలు
- జెండా ఆవిష్కరించిన అధ్యక్షుడు నాగుల విజయ్ కుమార్




సదాశివపేట: విజన్ ఆంధ్ర : ప్రభుత్వం ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ కి సబ్సిడీపై రుణాలు అందించి ఫోటోగ్రాఫర్ల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని పట్టణ ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుల విజయ్ కుమార్ అన్నారు. బుధవారం సదాశివపేట పట్టణంలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగుల విజయ్ కుమార్ మాట్లాడుతూ మన చేతిలో ఉన్న కెమెరా ఒక పరికరం మాత్రమే కాదు... అది మన వృత్తికి గుర్తింపు. మన ఐక్యతే మన బలం అన్నారు. చరిత్రను భద్రపరిచే బాధ్యత ఫోటోగ్రాఫర్లదన్నారు.మన యువ ఫోటోగ్రాఫర్లు కొత్త టెక్నాలజీని నేర్చుకోవాలి. ఫోటోగ్రఫీతో పాటు వీడియో, డ్రోన్, ఎడిటింగ్, ఆల్బమ్ డిజైన్, సోషల్ మీడియా కంటెంట్, ఎ ఐ వంటి కొత్త రంగాల్లో కూడా నైపుణ్యం పెంచుకోవాలి కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ముదిగొండ జయచింతన్, కోశాధికారి కర్ణాకర్, ఉపాధ్యక్షులు కాషా సంగమేశ్వర్,వై మహేష్, శివశంకర్, గొల్లపల్లి శ్రీనివాస్, రుమాండ్ల రాజు, బండారి సుభాష్, ఎం సంతోష్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో వ్యభిచార గుట్టురట్టు

**రెండు ఓయో హోటళ్లపై పోలీసుల దాడులు**

**11 మంది అదుపులోకి -- ముగ్గురు బాధిత మహిళల రక్షణ**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్న రెండు ఓయో హోటళ్లపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో ముగ్గురు బాధిత మహిళలను రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

బాలానగర్ డీసీపీ రీతిరాజ్ ఆదేశాల మేరకు కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలోని అల్లూరి ట్రేడ్ కాంప్లెక్స్‌లో ఉన్న సాయి ప్యారడైజ్ ఓయో హోటల్ మరియు వైశాలి కాటేజ్ ఓయో హోటల్‌లలో బుధవారం అర్ధరాత్రి ప్రత్యేక బృందాలు దాడులు నిర్వహించినట్లు కూకట్‌పల్లి ఏసీపీ నరేష్ రెడ్డి తెలిపారు.

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, దాడుల్లో మొత్తం 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఆరుగురు నిర్వాహకులు, ఐదుగురు కస్టమర్లు ఉన్నారు. అలాగే వ్యభిచార కార్యకలాపాలకు బలవంతంగా గురైన ముగ్గురు మహిళలను రక్షించి సంబంధిత అధికారుల సంరక్షణకు అప్పగించారు.

విచారణలో హోటళ్లలో జరుగుతున్న అక్రమ కార్యకలాపాల గురించి నిర్వాహకులకు పూర్తి అవగాహన ఉన్నట్లు తేలిందని ఏసీపీ తెలిపారు. ముఖ్యంగా ఆమని, రాజేష్ అనే ఇద్దరు వ్యక్తులు మధ్యవర్తుల సహకారంతో వ్యభిచార కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు.

నిందితులపై అనైతిక రవాణా నిరోధక చట్టం ఐటిపిఏ కింద రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. వ్యభిచారం, మహిళల అక్రమ రవాణా వంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఏసీపీ నరేష్ రెడ్డి సూచించారు.

# ఉద్యోగాల భర్తీకి ఈ నెల 20న మహాధర్నా

-నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలి: సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్

-కేంద్రంలో 10 లక్షలు, రాష్ట్రంలో 2 లక్షల ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

-ఉద్యోగం లభించే వరకు నెలకు రూ.5 వేల నిరుద్యోగ భృతి చెల్లించాలి

-ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం ఐక్య ఉద్యమానికి సిద్ధం: సీపీఎం

జగద్గిరిగుట్ట, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 20న మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న 'నిరుద్యోగుల కొలువుల కొట్లాట' మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు షాపూర్‌నగర్--గాజులరామారం చౌరస్తా వద్ద మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో మహాధర్నాకు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు గడిచినా యువతకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పాలక ప్రభుత్వాలు



విఫలమయ్యాయని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని 2014లో ఇచ్చిన హామీ ఏమైందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ శాఖల్లో లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల ఉద్యోగ అవకాశాలు మరింత క్షీణిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఏడాది వివిధ ప్రభుత్వ శాఖల్లో వేలాది మంది ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నారని, దీంతో ఖాళీల సంఖ్య మరింత పెరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేసి నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల హైడ్రా సంస్థలో పరిమిత సంఖ్యలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడగా వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవడం రాష్ట్రంలో ఉద్యోగాల కోసం యువత ఎదురుచూస్తున్న పరిస్థితికి అద్దం పడుతోందని లక్ష్మణ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని అమలు చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందని ఆరోపించారు. ఉద్యోగం లభించేంత వరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.5 వేల నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 10 లక్షల పోస్టులను, రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతను సమీకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మరింత ఉద్ధృతంగా ఉద్యమాలు చేపడతామని లక్ష్మణ్ హెచ్చరించారు. ఈ నెల 20న మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాకు నిరుద్యోగులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కే. శీను, ఆంజనేయులు, యాదవరెడ్డి, సంతోష్, సాయి, వాసు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# GO 97ను రద్దు చేయాలి

**- పాలిటెక్నిక్ విద్య ఎస్,బి, టి,ఈ,టి పరిధిలోనే కొనసాగాలి.. బి.ఆర్.ఎస్వి**

బెల్లంపల్లి ఆగస్టు 19 విజన్ ఆంధ్ర : పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను ఎస్,బి, టి,ఈ,టి పరిధిలోనే కొనసాగించాలని, విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే జీవో 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని బి.ఆర్.ఎస్వి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ డిమాండ్ చేశారు.

బెల్లంపల్లి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో కలిసి నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసిన విధానాలను తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థులపై రుద్దే ప్రయత్నాలను బిఆర్ఎస్వి తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. పాలిటెక్నిక్ విద్యకు సంబంధించి ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని, విద్యార్థులు, అధ్యాపకులు, విద్యా నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

**ఎస్,బి, టి,ఈ,టి బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం..**

దాని పరిధిని మార్చే ప్రయత్నాలు చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

జీవో 97ను వెంటనే ఉపసంహరించుకుని పాలిటెక్నిక్ విద్యను ఎస్,బి, టి,ఈ,టి పరిధిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే విద్యార్థులను కలుపుకుని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బడికల శ్రావణ్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు.

కార్యక్రమంలో బిఆర్ఎస్వి మాజీ పట్టణ అధ్యక్షుడు మురుకురి శ్రావణ్, రియాజ్, అరుణ్, సుమంత్, రాంచరణ్‌తో పాటు పలువురు పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

# దళిత విలేకరి పుల్ల రవితేజపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

**- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రాదండి దేవేందర్ డిమాండ్.**



భూపాలపల్లి జిల్లా ఆగస్టు 19 ( విజన్ ఆంధ్ర ) : చిట్యాల ఆర్‌బీ న్యూస్ రిపోర్టర్, దళిత విలేకరి పుల్ల రవితేజపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, దాడికి బాధ్యులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రాదండి దేవేందర్ డిమాండ్ చేశారు.

భూపాలపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు పుల్ల రవితేజను రాదండి దేవేందర్ పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను బాధితుడి నుంచి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రాదండి దేవేందర్ మాట్లాడుతూ.. దళిత విలేకరి పుల్ల రవితేజ ఇంటికి వెళ్లి దాడి చేయడం తీవ్రంగా ఖండించాల్సిన ఘటన అని అన్నారు. దాడిలో రవితేజ తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయి కిందపడిపోయారని, ఆయన భార్యను కూడా మహిళ అని చూడకుండా దాడి చేసి, గొంతు నొక్కే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.

ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి, బాధ్యులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ముక్కిరాల మధువంశీ, మింగిని నటరాజ్, బొజ్జం వేణుతో పాటు మరో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కులపరమైన దాడి లేదా అవమానానికి సంబంధించిన అంశాలు దర్యాప్తులో నిర్ధారణ అయితే ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీస్ నిరోధక) చట్టం కింద కేసులు నమోదు చేయాలని, దాడి తీవ్రతను బట్టి హత్యాయత్నం తదితర వర్తించే సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. పత్రికా విలేకరిపై దాడి చేయడం ప్రజాస్వామ్య విలువలకు, పత్రికా స్వేచ్ఛకు విరుద్ధమని అన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా పోలీసులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు ఈ ఘటనలో తన పార్టీకి చెందిన వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలితే, వారిపై పార్టీ పరంగా కూడా తగిన చర్యలు తీసుకోవాలని రాదండి దేవేందర్ డిమాండ్ చేశారు. కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరిగితే, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలతో పాటు ప్రజాసంఘాలను కలుపుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కోఆర్డినేటర్ కొత్తూరి రవీందర్, కో-కన్వీనర్ రాజ్‌మీర సమ్మె నాయక్, కో-కన్వీనర్ జోగుల సమ్మయ్య, మహాదళిత జనజాగృతి నాయకులు ఎలకటి రాజయ్య, అంబేద్కర్ సంఘాల నాయకులు పుల్ల ప్రేమసాగర్ తదితరులు రాదండి దేవేందర్ వెంట ఉన్నారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు సంఘాల తరపున పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి

పెద్ద శంకరంపేట్ ఆగస్టు 19: విజన్ ఆంధ్ర: పెద్ద శంకరంపేట్ మండలం జుక్కల్ గ్రామానికి చెందిన దుర్గా రెడ్డి మనుమని వివాహ వేడుకలకు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు సురేష్ గౌడ్, సర్పంచ్ సామెల్, ఉప సర్పంచ్ చాంద్ పాషా, అశోక్, సాయి బాబా, రతన్ తదితరులు పాల్గొన్నారు.

# క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో ప్లేస్ మెంట్ డ్రైవ్ లో 51 మంది విద్యార్థుల ఎంపిక..

ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్ట్ 19 (విజన్ ఆంధ్ర) :ఆర్మూర్ మండలంలోని చేపూర్ లోని క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో తెలంగాణ అకాడమీ పర్ స్కిల్ అండ్ నాలెడ్జ్( టీఏఎస్ కె) ఆధ్వర్యంలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్ కు బిటెక్ ఎంబీఏ చివరి సంవత్సరం విద్యార్థులతో పాటు 2026 లో పట్టభద్రులైన విద్యార్థులు కలిపి 125 మందికి పైగా హాజరయ్యారు వివిధ ఉద్యోగ విభాగాలకు నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో మొత్తం 51 మంది విద్యార్థులు ఎంపికయ్యారు ఈ ప్లేస్ మెంట్ డ్రైవ్ ను ప్లేస్ మెయిన్ హెచ్ ఆర్ సొల్యూషన్ సంస్థ నిర్వహించింది. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ శ్రీ అల్జాపూర్ దేవేందర్ గారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు ఉద్యోగ అవకాశాలను కల్పించడం కళాశాల ప్రధాన లక్ష్యాలలో ఒకటని ఆయన తెలిపారు ప్రస్తుతం పోటీ ప్రపంచంలో కేవలం విద్యార్హతలు మాత్రమే కాకుండా సమాచార మార్పిడి నైపుణ్యాలు సాంకేతిక పరిజ్ఞానం విశ్లేషణాత్మక ఆలోచన విధానం ప్రయోగిగా పరిజ్ఞానం వంటి నైపుణ్యాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు విద్యార్థులు చదువుకునే దశలోనే పరిశ్రమల అవసరాలకు అనుకూలంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కళాశాలలో విద్యార్థులకు మెరుగైన కెరీర్ అవకాశాలు కల్పించేందుకు నిరంతరం ప్రముఖ సంస్థలతో కలిసి ఉద్యోగ ఎంపిక కార్యక్రమాలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు విద్యార్థులు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్లేస్ మెంట్ డ్రైవ్ లో 51 మంది విద్యార్థులు ఎంపిక కావడం కళాశాలకు విద్యార్థులకు గర్వకారణం అని అన్నారు ఎంపికైన ప్రతి విద్యార్థికి అభినందలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ సంస్థలను కళాశాలకు తీసుకువచ్చి విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ



అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు .

కళాశాల ప్రిన్సిపల్ డా. కె శ్రీనివాస్ గారు మాట్లాడుతూ విద్యార్థుల కెరీర్ అభివృద్ధిలో ఉద్యోగ ఎంపిక కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు విద్యార్థులు తమ విద్యను ఉద్యోగ అవకాశాలతో అనుసంధానం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు సంస్థలు కోరుకునే నైపుణ్యాలను విద్యార్థులు ముందుగానే అభివృద్ధి చేసుకుంటే ఉద్యోగ సాధన మరింత సులభతరం అవుతుందని తెలిపారు.

క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో సమాచార మార్పిడి నైపుణ్యాలు ఇంటర్వ్యూ నైపుణ్యాలు సమస్య పరిష్కార సామర్థ్యం బృందంగా పనిచేసే నైపుణ్యం నాయకత్వం లక్షణాలను పెంపొందించేందుకు కళాశాల ప్రత్యేక దృష్టి సారిస్తుందని అన్నారు 125 మంది కీపైగా విద్యార్థులు ప్లేస్ మెంట్ డ్రైవ్ కు హాజరై 51 మంది ఎంపిక కావడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు ఎంపికైన విద్యార్థులు తమ ఉద్యోగ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు భవిష్యత్తులో కూడా విద్యార్థులకు మరిన్ని మంచి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా శిక్షణ మరియు నియామకాల విభాగంలో కలిసి కృషి చేస్తామని తెలిపారు.

కళాశాల పరిపాలన అధికారి శ్రీ బి నరేందర్ గారు మాట్లాడుతూ విద్యార్థులు ప్లేస్మెంట్ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ కెరీర్ కు మంచి దిశను ఏర్పరుచుకోవాలని అన్నారు. కళాశాల శిక్షణ మరియు నియామకాల అధికారి శ్రీ సునీల్ గారు మాట్లాడుతూ. విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందిస్తూ వివిధ కంపెనీల ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు 51 మంది విద్యార్థులు ఎంపిక కావడం సంతోషకరమని అన్నారు. తెలంగాణ అకాడమీ పర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టీఏఎస్ కె ప్రతినిధి శ్రీ రఘు తేజ గారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించేందుకు టీఏఎస్ కే ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్లస్ మెయిన్ హెచ్ ఆర్ సొల్యూషన్ సంస్థ మానవ వనరుల విభాగం ప్రతినిధులు శ్రీమతి సాయి లక్ష్మి గారు శ్రీ కె సతీష్ రెడ్డి గారు విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ శ్రీ అల్జాపూర్ శ్రీనివాస్ గారు ఫోన్ ద్వారా సందేశం అందిస్తూ ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు విద్యార్థులు తమ ప్రతిభను మరింతగా పెంపొందించుకొని ఉన్నతమైన కెరీర్ను నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ శ్రీ అల్జాపూర్ దేవేందర్ రెడ్డి గారు ప్రిన్సిపల్ డా. కె శ్రీనివాస్ గారు పరిపాలన అధికారి శ్రీ బి నరేందర్ గారు శిక్షణ మరియు నియామకాల అధికారి శ్రీ సునీల్ గారు మెకానికల్ విభాగాధిపతి శ్రీ వేద ప్రకాష్ గారు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఫ్యాకల్టీ ఇన్చార్జి శ్రీ రాజుగారు అన్ని విభాగాల విభాగ దీపతులు సోషల్ మీడియా ఇన్చార్జ్ శృతి న్ అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

# మద్దెల రామచంద్రయ్యకు ఎమ్మెల్యే కాలె యాదయ్య నివాళి

చేవెళ్ళ, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): మద్దెల రామచంద్రయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. బుధవారం చేవెళ్ళలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శివనీలచింటూ తండ్రి అయిన మద్దెల రామచంద్రయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రామచంద్రయ్య కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానిక నాయకులు బండారి ఆగిరెడ్డి, దేవర వెంకట్ రెడ్డి, మర్పల్లి కృష్ణారెడ్డి గోనె ప్రతాప్ రెడ్డి, పడాల ప్రభాకర్, పైండ్ల మధుసూదన్ రెడ్డి, అబ్దుల్ గని, కర్నే శివప్రసాద్, మూడవత్ కృష్ణనాయక్, కాసుల రాముగౌడ్, శంకర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిత్వ వికాసం మరియు నైపుణ్యాభివృద్ధి అవగాహనా కార్యక్రమం



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 19 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థులకు బుధవారం రోజున విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, ఉపాధి అవకాశాల సాధన మరియు వృత్తిపరమైన నైపుణ్యాల పెంపుదల లక్ష్యంగా వ్యక్తిత్వ వికాసం మరియు నైపుణ్యాభివృద్ధి అంశంపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కె. పురుషోత్తం ముఖ్య వక్తగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా జీవితంతో పాటు వృత్తి జీవితంలోనూ విజయవంతంగా రాణించడానికి అవసరమైన వ్యక్తిత్వ లక్షణాలు, నైపుణ్యాలు మరియు సానుకూల దృక్పథం గురించి ఆయన విపులంగా వివరించారు. వ్యక్తిత్వ వికాసం అనేది కేవలం బాహ్య ప్రవర్తనకు మాత్రమే పరిమితం కాదని, అది వ్యక్తి ఆలోచనా విధానం, మాట్లాడే తీరు, ప్రవర్తన, విలువలు మరియు భావోద్వేగాలను సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యానికి సంబంధించినదని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగదాతలు విద్యార్హతలతో పాటు ఆత్మవిశ్వాసం, సమర్థవంతమైన కమ్యూనికేషన్, నాయకత్వ లక్షణాలు మరియు బృందంతో కలిసి పనిచేసే నైపుణ్యాలను కూడా ప్రాధాన్యంగా పరిగణిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు కళాశాలలో చేరిన తొలి రోజు నుంచే కొత్త విషయాలను నేర్చుకునే అలవాటును పెంపొందించుకోవాలని, ముఖ్యంగా ఎన్పిటీఈఎల్ వంటి జాతీయ స్థాయి ఆన్‌లైన్ విద్యా వేదికలను ఉపయోగించి తమ జ్ఞానాన్ని విస్తరించుకోవాలని ప్రోత్సహించారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా, ప్రేరణాత్మకంగా, మార్గదర్శకత్వం విద్యార్థుల్లో నిరంతర అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి, ఆత్మవిశ్వాసం మరియు ఉత్తమ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలనే స్ఫూర్తిని నింపిందన్నారు.

# రైతులు సమీకృత వ్యవసాయంపై దృష్టి సాధించాలి

ముధోల్:ఆగష్టు 19:విజన్ ఆంధ్ర. రైతులు సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ కే. సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలో తరోడా గ్రామ శివారులో రైతు సాగుచేస్తున్న సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు. రైతు సాగు చేస్తున్న చేపల పెంపకాన్ని స్వయంగా చూసి ఎదుగుదల, ఆహారాన్ని అందిస్తున్న విషయాలను తెలుసుకున్నారు. వ్యవసాయ క్షేత్రంలో పంటల సాగుతో పాటు వివిధ అనుబంధ కార్యకలాపాలను సమన్వయం చేసుకుంటూ రైతు చేపడుతున్న విధానాన్ని ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీకృత వ్యవసాయ విధానం ద్వారా రైతులు తమ భూమిని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు వ్యవసాయంపై ఆధారపడిన ఆదాయ వనరులను పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. అంతకుముందు గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి హరితవనోత్సవంలో భాగంగా మొక్కను నాటా రు. ఈయన వెంట డిఆర్డీవో విజయలక్ష్మి, ఎంపీడీవో లవ కుమార్, డిఎల్పిఓ లక్ష్మణ్, సర్పంచ్ అరీ పొద్దీన్, పంచాయతీ కార్యదర్శి అమిత, ఏపీవో శిరీష,ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ లుతోపాటు తదితరులున్నారు.

# అసైన్డ్ భూమిలో మసీదు నిర్మాణమా.?

**అధికారులు ఏం చేస్తున్నారు..**

**- అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలి**

**- బజరంగ్‌దళ్ విభాగ్ కన్వీనర్ గూడెం రమేష్**



చేవెళ్ళ, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : చేవెళ్ళ మండల పరిధి కుమ్మెర గ్రామపంచాయతీలో అసైన్డ్ భూమిలో అనుమతులు లేకుండా మసీదు నిర్మాణానికి పునాదులు వేస్తున్నారని బజరంగ్‌దళ్ విభాగ్ కన్వీనర్ గూడెం రమేష్ తీవ్రంగా ఆరోపించారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణం జరుగుతున్నా అధికారులు నిద్రపోతున్నారా? అంటూ ఆయన మండిపడ్డారు. అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన కుమ్మెరలోని అక్రమ నిర్మాణాన్ని స్వయంగా పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు తమ బాధ్యతను విస్మరిస్తున్నారని ఆరోపించారు. గ్రామస్థులు నిర్మాణంపై అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. అసైన్డ్ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతుంటే రెవెన్యూ అధికారులు, గ్రామ కార్యదర్శి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. శ్రీ వీర హనుమాన్ దేవాలయానికి సమీపంలో నిర్మాణం చేపడుతున్నారని, నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని గ్రామ కార్యదర్శి కరుణాకర్ కూడా తెలిపారని రమేష్ పేర్కొన్నారు. అయినా నిర్మాణ పనులు కొనసాగడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వెంటనే పునాది పనులను నిలిపివేసి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణానికి పూనుకున్న వారిపై పోలీసు శాఖ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని, లేదంటే విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని రమేష్ హెచ్చరించారు. అవసరమైతే నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కార్యకర్తలు, హిందూ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ధర్మప్రచార్ రాఘవేంద్రచారి, బజరంగ్ దళ్ కార్యకర్తలు మహేంద్ర, వడ్ల అక్షయ్, కుమ్మెర గ్రామ మాజీ సర్పంచ్ భానుతేజ, చెన్నోల శ్రీనివాస్, కావలి లక్ష్మీనారాయణ, కావలి కుమార్, బోనగిరి దర్శన్, చంద్రశేఖర్‌రెడ్డి, చాకలి శ్రీకాంత్, కావలి వెంకటేశం, బోధే విష్ణువర్ధన్‌రెడ్డి, బాధే శ్రీకాంత్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి లాభాల తగ్గుదలపై స్పష్టత ఇవ్వాలి

**- రూ.6,393 కోట్ల నుంచి రూ.1,750 కోట్లకు తగ్గడంపై వివరణ ఇవ్వాలి**

**విప్లవ కార్మిక సంఘాల డిమాండ్**

బెల్లంపల్లి, ఆగస్టు 19 విజన్ ఆంధ్ర : సింగరేణి కాలరీస్ సంస్థ లాభాలు భారీగా తగ్గడంపై యాజమాన్యం, ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని విప్లవ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 12వ వేతన ఒప్పందంతోపాటు సింగరేణి ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ , 2024--25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి రూ.6,393 కోట్ల లాభాలు ఆర్జించినట్లు ప్రకటించిందని నాయకులు తెలిపారు. సంస్థ అభివృద్ధి, భవిష్యత్తు పెట్టుబడుల కోసం రూ.4,034 కోట్లు కేటాయించిన తర్వాత మిగిలిన రూ.2,360 కోట్లలో 34 శాతం చొప్పున కార్మికులకు రూ.819 కోట్ల లాభాల వాటా ప్రకటించారని పేర్కొన్నారు. అయితే 2025--26 ఆర్థిక సంవత్సరంలో లాభాలు




సుమారు రూ.1,750 కోట్లకు తగ్గినట్లు వార్తలు రావడంతో కార్మికుల్లో అనేక సందేహాలు నెలకొన్నాయని తెలిపారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా, అమ్మకాలు, ఉత్పత్తి వ్యయాలు, వేతనాలు, విద్యుత్ రంగ పరిస్థితులు, భవిష్యత్తు ప్రాజెక్టులకు కేటాయింపులు తదితర అంశాలు సంస్థ లాభాలపై ప్రభావం చూపుతాయని నాయకులు పేర్కొన్నారు. రూ.6,393 కోట్ల నుంచి రూ.1,750 కోట్లకు లాభాలు ఎందుకు తగ్గాయో పూర్తి ఆడిట్ చేసిన ఆర్థిక నివేదికల ఆధారంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. 2024--25లో సింగరేణి 6.901 కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన నేపథ్యంలో 2025--26లో బొగ్గు ఉత్పత్తి, రవాణా, అమ్మకాల ఆదాయం, వ్యయాల్లో వచ్చిన మార్పులను కార్మిక వర్గానికి తెలియజేయాలని కోరారు. రూ.6,393 కోట్ల లాభాల్లో ఏయే ఖర్చులు, కేటాయింపులు మినహాయించారో, రూ.1,750 కోట్ల లాభం ఎలా లెక్కించారో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. సంస్థ అభివృద్ధి, భవిష్యత్తు ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు ఎంతనేది, లాభాల వాటాను ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తున్నారో తెలియజేయాలని కోరారు. పూర్తి ఆడిట్ చేసిన ఆర్థిక లెక్కలను కార్మికులు, కార్మిక సంఘాలకు అందుబాటులో ఉంచాలని సింగరేణి యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని విప్లవ కార్మిక సంఘాల నాయకులు ఎం. పోచమల్లు, అంబాల మహేందర్ డిమాండ్ చేశారు.

# బూత్ బలోపేతమే బీజేపీ విజయానికి బాట

-SIR రెండో దశను విజయవంతం చేయాలి: ఎంపీ ఈటల రాజేందర్
-ఓటరు జాబితాలో గల్లంతైన ప్రతి ఓటును గుర్తించి నమోదు చేయించాలి

కొంపల్లి, ఆగస్టు 18 (విజన్ ఆంధ్ర): రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఏ ఎమ్ ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఎ×= రెండో దశ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

ఓటే గెలుపుకు కీలక ఆయుధం

ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఓటు అత్యంత కీలకమైన ఆయుధమని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఎస్ ఐ ఆర్ రెండో దశ కార్యక్రమాన్ని ప్రతి బీజేపీ కార్యకర్త బాధ్యతగా తీసుకుని క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని సూచించారు. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన ఏ ఒక్కరి ఓటు కూడా జాబితా నుంచి గల్లంతు కాకుండా చూడాలని అన్నారు.

గల్లంతైన ఓట్లను గుర్తించి నమోదు చేయించాలి

ప్రతి బూత్ పరిధిలో ఓటరు జాబితాను పరిశీలించి మిస్ అయిన ఓట్లను గుర్తించాలని, అర్హులైన వారి ఓట్లను తప్పనిసరిగా నమోదు చేయించేలా కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీ సూచించారు. బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం ద్వారా రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. మల్లారెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ నందనం దివాకర్, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా నాదీజ మోర్చా అధ్యక్షుడు జే.కే. శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ దీూా-1 శివాజీ రాజా, రాజేందర్ రెడ్డి, రమేష్ యాదవ్, శ్రీహరి, రాజమణి, లత, మురళి గౌడ్తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరయ్యారు. బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేసి, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేయడం ద్వారా రాబోయే ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు.



## ఏవెన్యూ ప్లాంటేషన్ ప్రారంభించిన సర్పంచ్

వాజేడు,ఆగస్టు19(విజన్ ఆంధ్ర):గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీలో ఏవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని బుధవారం సర్పంచి బోదెబోయిన భరత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ... రోడ్లు, రహదారులు, నడకమార్గంలో చెట్లను నాటడంతో పరిసరాల అందాన్ని మెరుగుపరుస్తుందన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గిస్తుందని, అదేవిధంగా నేల కోతను నివారిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు

# షెడ్యూల్డ్ ప్రాంతంలో 75% రిజర్వేషన్ ఇవ్వాలి

**-కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో జీఓ 109 ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్**
**-గాదిగూడలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సంపూర్ణ బంద్**

గాదిగూడ,ఆగస్టు 19(విజన్ ఆంధ్ర):పోలీస్ కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్‌లో జీఓ నంబర్ 109 ప్రకారం ఏజెన్సీ ప్రాంత అభ్యర్థులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం గాదిగూడలో సంపూర్ణ బంద్ నిర్వహించారు. రాష్ట్ర ఏజెన్సీ బంద్‌కు మద్దతుగా వ్యాపార, వాణిజ్య సంస్థలను స్వచ్ఛందంగా మూసివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ సంతోష్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో విద్య, ఉద్యోగ నియామకాల్లో స్థానిక ఆదివాసీ అభ్యర్థులకు ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో షెడ్యూల్డ్ ప్రాంత అభ్యర్థులకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాల్లో న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, జీఓ నంబర్ 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి ఆదివాసీల హక్కులు, భూములకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసీ ప్రాంతాల్లో అమలులో ఉన్న ప్రత్యేక నిబంధనలను సమర్థంగా అమలు చేయకుండా నియామకాలు చేపడితే స్థానిక



యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు మాడావి చంద్రహరి,ఆదివాసీ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు మారప గంగారాం, టీజీవీ మండల అధ్యక్షుడు కుంరం భీంరావు,సర్పంచ్ తనాజీ అమృతరావు,జాకు సంతోష్, జంగు,విజయ్, లింగు దేవరావు తదితర యువ నాయకులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూమిలో మసీదు నిర్మాణమా.?



వెంటనే పునాది పనులను నిలిపివేసి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణానికి పూనుకున్న వారిపై పోలీసు శాఖ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని, లేదంటే విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని రమేష్ హెచ్చరించారు. అవసరమైతే నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కార్యకర్తలు, హిందూ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ధర్మప్రచార్ రాఘవేంద్రచారి, బజరంగ్ దళ్ కార్యకర్తలు మహేంద్ర, వడ్ల అక్షయ్, కుమ్మెర గ్రామ మాజీ సర్పంచ్ భానుతేజ, చెన్నోల శ్రీనివాస్, కావలి లక్ష్మీనారాయణ, కావలి కుమార్, బోనగిరి దర్శన్, చంద్రశేఖర్‌రెడ్డి, చాకలి శ్రీకాంత్, కావలి వెంకటేశం, బోధే విష్ణువర్ధన్‌రెడ్డి, బాధే శ్రీకాంత్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి వేళ.. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులకు పిలుపు

**- ఎల్-నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన**

నంగునూరు మండలం ఆగస్టు 19 విజన్ ఆంధ్ర : వాతావరణ మార్పులు, ఎల్-నినో పరిస్థితుల ప్రభావంతో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనూ, వేసవిలోనూ నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో నంగునూరు మండల రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ వైపు ప్రోత్సహించేందుకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నారు.

ఆగస్టు 20న ఉదయం 10 గంటలకు నర్మెట రైతు వేదికలో ఈ సదస్సు జరుగుతుందని మండల ప్రత్యేక అధికారి శివరంజని తెలిపారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలు, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, ఉపాధి హామీ శాఖల అధికారులు పాల్గొని రైతులకు సూచనలు అందించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేయనున్నారు. వరి సాగుకు అధికంగా నీరు అవసరమయ్యే పరిస్థితుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని అధికారులు వివరించనున్నారు. ఆయిల్‌పామ్, కందులు, మినుములు, సజ్జ, రాగి, ఆముదం, పొద్దుతిరుగుడు, వేరుశనగతో పాటు కూరగాయల సాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. ప్రతి పొలంలో ఫామ్ పాండ్లు నిర్మించుకోవడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని అవసరమైన సమయంలో వంటలకు వినియోగించుకోవచ్చని అధికారులు సూచించనున్నారు. భూగర్భ జలాల పరిరక్షణ, నీటి పొదుపు, సమర్థవంతమైన నీటి యాజమాన్య పద్ధతులపై కూడా సదస్సులో చర్చించనున్నారు.

ఒక ఎకరం వరి సాగుకు వినియోగించే నీటితో పరిస్థితులకు అనుగుణంగా 3 నుంచి 9 ఎకరాల వరకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. తద్వారా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేసి ఆదాయం పెంచుకునే మార్గాలను వివరించనున్నారు.



"తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేద్దాం--అధిక ఆదాయాన్ని పొందుదాం" అనే నినాదంతో రైతులను చైతన్యపరచనున్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, రైతులు సదస్సుకు హాజరై మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, నీటి సంరక్షణపై అవగాహన పొందాలని మండల ప్రత్యేక అధికారి శివరంజని కోరారు.

"నీటి వినియోగాన్ని తగ్గిద్దాం... వరి సాగును పరిమితం చేద్దాం... ఆరుతడి పంటలను ప్రోత్సహిద్దాం!" అనే సందేశంతో రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించనున్నారు.

# గురుకుల విద్యార్థినిలపై పీఈటి దాడి



మందమర్రి, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : మండల కేంద్రంలోని రామకృష్ణాపూర్ సాంఘిక సంక్షేమ బాలిక గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థినిలపై పాఠశాల పిఈటి మల్లికా దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం సాయంత్రం స్నాక్స్ సమయంలో మెస్ లీడర్స్ గా ఉన్న ముగ్గురు విద్యార్థినిలపై పీఈటి హెచ్చరిస్తూ చేతులపై కొట్టినట్లు తెలుస్తుంది. దాడి జరిగిన విషయాన్ని విద్యార్థినీల తల్లిదండ్రులకు తెలపడంతో బుధవారం పాఠశాలకు చేరుకున్నారు. ప్రిన్సిపల్ ప్రేమ రాణి తల్లి తండ్రులతో మాట్లాడి తప్పుకుండా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పండతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా జరిగిన విషయంపై పీఈటీ మల్లికను 'విజన్ ఆంధ్ర రిపోర్టర్' ఫోన్లో సంప్రదించగా ప్రస్తుతం లీవ్లో ఉన్నట్లు చెప్పారు.

## ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు..

లికుకునూరుపల్లి, ఆగస్టు 19,విజన్ ఆంధ్ర : ఓపెన్ స్కూల్ విద్యా విధానంలో 2026-27 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ లో చేరేందుకు అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు కుకునూర్ పల్లి ఉన్నత పాఠశాల ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ ఎంఈఓ బచ్చలి సత్తయ్య తెలిపారు. కుకునూరుపల్లి పాఠశాలకు సెంటర్ మంజూరు అయిందని మధ్యలో చదువు ఆపేసిన వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓపెన్ స్కూల్ విధానాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 31 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా అడ్మిషన్లు పొందుటకు అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి కలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు, పూర్తి వివరాలకుకుకునూరుపల్లి ఉన్నతపాఠశాలలో సంప్రదించవచ్చన్నారు.

## సర్పంచ్ కుటుంబానికి ఆర్థిక సహాయం

బోధన్, ఆగస్టు19 (విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ జిల్లా ఎర్రట్ల మండలం, తాళ్ల రాంపూర్ గ్రామ సర్పంచ్ బెజ్జారపు పావని ఆకస్మిక మరణంతో వారి కుటుంబాన్ని బోధన్ మండల సర్పంచుల ఫోరం సభ్యులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు పోరెడ్డి గంగాధర్ చేతుల మీదుగా 50,000 రూపాయలు ఆర్థిక సహాయం సర్పంచ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. సర్పంచులకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉ ఒడటమే మా లక్ష్యమని, ఈ కార్యక్రమం ద్వారా ఆ బాధ్యతను నెరవేర్చామని ఫోరం సభ్యులు తెలిపారు.

# మహాదేవపురం రెవెన్యూ సమస్య పరిష్కారానికి కూన శ్రీశైలం గౌడ్ హామీ

-329/4--329/10 సర్వే నంబర్ల సమస్యపై అధికారులతో మాజీ ఎమ్మెల్యే చర్చ

-ప్లాట్ యజమానులందరినీ మంత్రి వద్దకు తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని వెల్లడి



గాజులరామారం, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): మహాదేవపురం కాలనీకి సంబంధించిన రెవెన్యూ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ రెవెన్యూ అధికారులను కోరారు. బుధవారం మహాదేవపురం కాలనీ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులతో కలిసి ఎంఆర్ఓ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, కాలనీలోని 329/4 నుంచి 329/10 వరకు ఉన్న సర్వే నంబర్లకు సంబంధించిన సమస్యపై అధికారులతో చర్చించారు. సమస్యను పరిష్కరించే దిశగా తగిన చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను కోరిన కూన శ్రీశైలం గౌడ్, ప్లాట్ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. అతి త్వరలోనే మహాదేవపురం కాలనీలోని ప్లాట్ యజమానులందరినీ సంబంధిత మంత్రి వద్దకు తీసుకువెళ్లి, సమస్యకు పరిష్కారం లభించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ ప్రజలు, ప్లాట్ యజమానులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా అధికారులు కూడా సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం వెల్ఫేర్ సొసైటీ జనరల్ సెక్రటరీ ప్రసాద్ దుగ్యాల, ఉపాధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, రంగారావు, జాయింట్ సెక్రటరీలు రామచంద్రారెడ్డి, ప్రవీణ్ కుమార్, సొసైటీ సభ్యులు మహేశ్వర్ రెడ్డి, దిలీప్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసరావు, నరేందర్ రెడ్డి తదితరులు, ప్లాట్ యజమానులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# కార్మికుల న్యాయమైన డిమాండ్లకు రాగిడి లక్ష్మారెడ్డి మద్దతు

-మయోరా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కార్మికుల సమ్మెలో పాల్గొని సమస్యలు తెలుసుకున్న మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి

-వేతన ఒప్పందం, ఉద్యోగ భద్రత, కాంట్రాక్ట్ కార్మికుల క్రమబద్ధీకరణకు మద్దతు




దుండిగల్, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): మయోరా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన సమ్మెలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొని వారి సమస్యలు, న్యాయమైన డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, న్యాయబద్ధమైన డిమాండ్ల సాధనకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. కార్మికులు తమ చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌పై తక్షణమే చర్చలు జరిపి న్యాయబద్ధమైన వేతన ఒప్పందం కుదుర్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు. కార్మికులపై కక్షసాధింపు చర్యలు, వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే డిస్మిస్ చేసిన వైస్ ప్రెసిడెంట్ బాలమల్లేశ్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, రెండువేల ఇరవై రెండో సంవత్సరంలో కొత్తగా విభజించిన కెపాసిటీ ఇన్సెంటివ్స్‌ను తక్షణమే చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు. కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించాలని కూడా డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చర్చల ద్వారా ముందుకు రావాలని, న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి కోరారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు అవసరమైన సహకారం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్, మయోరా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ సెక్రటరీ జె. సంతోష్‌కుమార్, బాలమల్లేశ్, శ్రీను, నర్సింహా, మహేష్, ప్రసాద్, బాలకృష్ణ, బాబా, వి. సతీష్‌కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు. కార్మికుల హక్కుల కోసం... న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం కొనసాగుతుందని కార్మిక సంఘాల ప్రతినిధులు తెలిపారు.

# ఉట్నూర్‌లో విజయవంతమైన ఏజెన్సీ బంద్



ఉట్నూర్, ఆగస్టు 19, (విజన్ ఆంధ్ర) : ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 19న చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఏజెన్సీ బంద్ ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రశాంతంగా కొనసాగింది. ఉట్నూర్‌తో పాటు జిల్లాలోని పలు ఏజెన్సీ మండలాల్లో బంద్‌కు ప్రజలు, యువత, ఉద్యోగులు, వ్యాపార వర్గాలు పెద్ద ఎత్తున మద్దతు తెలిపారు.

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉద్యోగ నియామకాల విషయంలో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే పరిష్కరించాలని తుడుం దెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. 29 శాఖలకు సంబంధించిన షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకుని, జీఓ నంబర్ 3తో సహా ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని కోరారు.

తెలంగాణ స్టేట్ పోలీస్ డిపార్ట్‌మెంట్ సర్వీస్ రూల్స్ గెజిట్ నోటిఫికేషన్ తేదీ 10-05-2018లోని పేజీ నంబర్ 3, క్లాజ్ 2(అ)లో షెడ్యూల్డ్ ఏరియాకు 75 శాతం రిజర్వేషన్ గురించి స్పష్టంగా పేర్కొన్నట్లు నాయకులు తెలిపారు. అలాగే +ూ వీం చీశీ.30 ట్రైబల్ వెల్ఫేర్, తేదీ 11-07-2019లోని సీరియల్ నంబర్ 9, జీవో న.109, తేదీ 17-06-1988 ప్రకారం షెడ్యూల్డ్ ఏరియా అభ్యర్థులకు 75 శాతం అవకాశాలు కల్పించాల్సి ఉందన్నారు.

గతంలో 2015, 2018, 2022 సంవత్సరాల్లో జారీ చేసిన పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్లలో ఈ నిబంధనలను అమలు చేయడం ద్వారా ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ అభ్యర్థులకు న్యాయం జరిగిందని వారు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం పోలీస్ శాఖ సాధారణ జీవోల ఆధారంగా నోటిఫికేషన్ జారీ చేయడం వల్ల ఐదో షెడ్యూల్ ప్రాంతానికి చెందిన ఆదివాసీ నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదివాసీ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో న్యాయం జరిగేలా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేయాలని తుడుం దెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. రానున్న ఉ ద్యోగ నోటిఫికేషన్లలో ఐదో షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించి, ఆదివాసీ నిరుద్యోగులకు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పూర్క బాపూరావు తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, పెందోర్ దాదిరావు తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు, కొట్నాక విజయ్ కుమార్, వెడ్మ కొద్దు పటేల్, ఆడ భీంరావు, రాజ్ కుమార్, పెందోర్ మోతిరావు, సోయం శంకర్, గేడం నిరంజన్, గేడం ఈశ్వర్, పెందోర్ కృష్ణ, కుంరం కోటేష్, మంగం దీపక్, కుడిమేత మనోహార్, మాడావి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# శక్తి పాలసీపై పాలిటెక్నిక్ విద్యార్థుల నిరసన

- మూడో రోజుకు చేరిన ఆందోళనలు

- పోలీస్ బందోబస్తు -- జీవో 97 రద్దుకు డిమాండ్

తరగతులు బహిష్కరించడంతో కళాశాలలో విద్యా కార్యకలాపాలు

చౌటకూర్ ఆగస్టు 19 విజన్ ఆంధ్ర:- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన "శక్తి విధానం" మరియు జీవో నంబర్ 97ను వ్యతిరేకిస్తూ సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల పరిధిలోని శివంపేట (హొన్నపూర్ -- జోగిపేట) ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరసన బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. పాలిటెక్నిక్, ఐటీఐ తదితర వృత్తి విద్యా సంస్థలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు తరగతులను పూర్తిగా బహిష్కరించి, కళాశాల ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు.

విద్యార్థుల ప్రధాన అభ్యంతరాలు:

డిప్లొమా ఉనికికి ముప్పు: దశాబ్దాలుగా ప్రత్యేక సాంకేతిక విద్యా గుర్తింపు ఉన్న పాలిటెక్నిక్ డిప్లొమా ఇంజనీరింగ్‌ను కేవలం సాధారణ నైపుణ్య శిక్షణ కోర్సుల స్థాయికి కుదిస్తున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నత విద్యా అవకాశాలకు గండి: విలీనం కారణంగా బీటెక్ ప్రవేశాల కోసం నిర్వహించే (ఈసెట్) అర్హత, లేటరల్ ఎంట్రీ ప్రవేశాలు దెబ్బతింటాయని విద్యార్థులు భయపడుతున్నారు.

కోర్సు నిర్మాణం, పరీక్షల్లో గందరగోళం: విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలతో సంప్రదింపులు జరపకుండా ఏకపక్షంగా కార్మిక, శిక్షణ విభాగాల పరిధిలోకి మార్చడం విద్యా ప్రమాణాలను దెబ్బతీస్తుందని పేర్కొంటున్నారు.

లెక్చరర్ల మద్దతు -- "మా డిప్లొమా.. మా ఐడెంటిటీ" నినాదాలు

విద్యార్థుల ఆందోళనకు కళాశాల లెక్చరర్లు సైతం నల్లబ్యాడ్జీలు ధరించి మద్దతు పలికారు. "మా డిప్లొమా.. మా ఐడెంటిటీ.. మాకు న్యాయం కావాలి" అంటూ విద్యార్థులు ప్లకార్డులతో నినదించారు. ప్రభుత్వ




ఏకపక్ష నిర్ణయం వల్ల కోర్సుల నాణ్యత, పరీక్షల నిర్వహణ ప్రమాణాలు పడిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయ రహదారిపై ఉద్రిక్తత -- పోలీసుల జోక్యం

ఆందోళనలో భాగంగా విద్యార్థులు సంగారెడ్డి-నాందేడ్-అకోలా (ఎన్‌హెచ్-161) జాతీయ రహదారిపై రాస్తారోకోకు యత్నించగా, జోగిపేట సీఐ అనిల్ కుమార్ అక్కడికి చేరుకుని అనుమతి లేదని వారిని నిలువరించారు. అనంతరం సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కళాశాల ఆవరణలోనే శాంతియుతంగా నిరసన తెలపాలని సూచించారు. అనంతరం విద్యార్థులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు తరలివెళ్లారు.

పోలీస్ బందోబస్తు -- జీవో 97 రద్దుకు డిమాండ్

తరగతులు బహిష్కరించడంతో కళాశాలలో విద్యా కార్యకలాపాలు పూర్తిగా స్తంభించాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా కళాశాల పరిసరాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జీవో నంబర్ 97ను ఉపసంహరించుకునే వరకు తమ ఆందోళనను విరమించే ప్రసక్తే లేదని విద్యార్థులు స్పష్టం చేశారు.

## ఎంఆర్ఆర్ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవంలో ప్రముఖులు

బెల్లంపల్లి, ఆగస్టు 19 విజన్ ఆంధ్ర : పెద్దనపల్లి పరిధిలో నూతనంగా నిర్మించిన ఎంఆర్ఆర్ ఫంక్షన్ హాల్ బుధవారం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీ దండే విఠల్, మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ నూతన ఫంక్షన్ హాల్ ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. వివాహాలు, శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు ఇది స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఫంక్షన్ హాల్ నిర్వాహకులకు మంచి ఆదరణ లభించి, వ్యాపారంలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్సీ దండే విఠల్, మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి, నాయకులు దావ రమేష్, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేలా ఫంక్షన్ హాల్‌ను నిర్వహించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, నిర్వాహకులు, స్థానికులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## సుల్తాన్‌పూర్‌లో బస్‌స్టాప్ నిర్మాణ పనులకు శ్రీకారం

చౌటకూర్ ఆగస్టు 19 ( విజన్ ఆంధ్ర ) :- చౌటకూర్ మండలం పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో బస్‌స్టాప్ నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రజల రవాణా ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చొరవ తీసుకుని, ఇక్కడ బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి సూచనల మేరకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సుల్తాన్‌పూర్‌కు చేరుకుని స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనులను మొదలుపెట్టారు. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న బస్‌స్టాప్ నిర్మాణం ప్రారంభం కావడంపై గ్రామస్తులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి బస్‌స్టాప్ మంజూరు చేయించినందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహకు సుల్తాన్‌పూర్ సర్పంచ్ చంటి గీతారాణి, ఉపసర్పంచ్ గొల్ల మహేష్ యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంగళ్ మహేష్, గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎండీ రషీద్ తదితరులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కోర్పోల్ గ్రామ ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకుని బస్‌స్టాప్ సాధన కోసం కృషి చేసిన కాంగ్రెస్ నాయకులు సార సంజయ్, మైపాల్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, చల్లా రాములు, ధనంపల్లి బాలయ్యలకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తయి బస్‌స్టాప్ త్వరలోనే అందుబాటులోకి వస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆలయ నిర్మాణం కోసం భూమి పూజ

లక్షెట్టిపేట ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర ) మండలంలోని గుల్లకోట గ్రామంలో రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణ కోసం భూమి పూజ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సహాయ సహకారాలు ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులను కోసం ఎప్పుడూ ఉంటాయన్నారు. ఎమ్మెల్యే కి ప్రజలు అన్న ప్రజలు కొలిచే దేవుళ్ళు అన్న ఎనలేని అభిమానం అని అన్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే కి ప్రజలే దేవుళ్ళు అని గుర్తు చేశారు. అనంతరం మాజీ డీసీసీ అధ్యక్షురాలు సురేఖమ్మని గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. అంతకుముందు గ్రామస్తులు సురేఖమ్మకి ఘన స్వాగతం పలికి కార్యక్రమం ఆరంభించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవేందర్ రెడ్డి, సర్పంచ్లు బానేష్, భాను జిల్లా నాయకులు పూర్ణచంద్రరావు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

## నేటి నుంచి పోలీసు ఉద్యోగాలకు దరఖాస్తులు:

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్రంలో పోలీసు, అనుబంధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మొత్తం 7,437 ఉద్యోగాల నియామక ప్రక్రియ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణతో ప్రారంభ మైంది. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు టీజీపీఆర్‌బీ, ఆధ్వ ర్యంలో నిర్వహించే ఈ ప్రక్రియ కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ www.tgprb.in లో నేటి ఉదయం 8 గంటల నుంచి సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు.

ఈ నియామకాల్లో పోలీసు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్పీ ఎఫ్ ఫైర్ సర్వీసెస్, జైళ్ల శాఖ విభాగా ల్లోని పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్, ఏఆర్, టీజీఎస్పీ), అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఫింగర్ ప్రింట్ బ్యూరో), భారీ సంఖ్యలో సివిల్, ఏఆర్ కానిస్టేబుల్ పోస్టులతో పాటు ఫైర్ ఫైటర్లు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, జైళ్ల శాఖలో వార్డర్లు, డిప్యూటీ జైలర్ పోస్టులు ఉన్నాయి. ముఖ్యంగా 3,697 సివిల్ కానిస్టేబుల్ ఖాళీలు ఉన్నాయి.

ప్రభుత్వం ఈసారి అభ్యర్థుల వయో పరిమితిని పెంచడం తో దరఖాస్తుదారుల సంఖ్య మునుపటి కంటే భారీగా పెరిగే అవకాశం కనిపిస్తోం ది. దరఖాస్తు ప్రక్రియ లో ఎలాంటి అక్రమా లకు తావులేకుండా పారదర్శకత కోసం అధికారులు ఈసారి ఆధార్ ఫేస్ అథెంటికేషన్‌ను తప్పనిసరి చేశారు. దీనికోసం అభ్యర్థులు తమ ఫోన్లలో ముందుగానే ఆధార్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

దరఖాస్తు విధానం పార్ట్-1, పార్ట్-2ల ద్వారా జరుగుతుం ది. అభ్యర్థులు తమ మొబైల్ నంబర్‌తో నమోదు చేసుకున్న తర్వాత అవసరమైన విద్యార్హత ధ్రువపత్రా లు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, సంతకాన్ని నిర్దేశిత పరిమాణంలో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

చివరి తేదీ వరకు వేచి చూడకుండా అభ్యర్థులు తగిన సర్టిఫికెట్లతో వెంటనే దరఖాస్తు చేసుకో వాలని సూచించారు. సకాలంలో దరఖాస్తులు పూర్తి చేసి అభ్యర్థులు తమ అర్హతకు తగ్గ పోస్టు లకు పోటీపడవచ్చు.

## జిజ్ఞాస రాష్ట్రస్థాయి ప్రదర్శనలో చేవెళ్ల విద్యార్థుల ప్రతిభ

చేవెళ్ల, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిజ్ఞాస రాష్ట్రస్థాయి స్టడీ ప్రాజెక్ట్ ప్రదర్శనలో చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫిజిక్స్ విభాగంలో ప్రతిభ కనబరిచారు. డా. ఎన్. విజయలక్ష్మి మార్గనిర్దేశంలో విద్యార్థులు ప్రాజెక్ట్‌ను సమర్థవంతంగా ప్రదర్శించగా, అకాడమిక్ ఆఫీసర్ డా. పుష్పలత మేడమ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడంలో జిజ్ఞాస కార్యక్రమాలు దోహదపడతాయని కళాశాల వర్గాలు పేర్కొన్నాయి. విద్యార్థుల అంకితభావం, నిరంతర కృషి ఈ విజయానికి కారణమని, డా. ఎన్. విజయలక్ష్మి మార్గనిర్దేశం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది విద్యార్థులను, డా. ఎన్. విజయలక్ష్మిని అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని పరిశోధనలు, ఆవిష్కరణలతో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



# యువత చేతుల్లోనే భవిష్యత్

## మంత్రి వివేక్,ఎంపీ వంశీ కృష్ణ

మందమర్రి, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : యువత చేతుల్లోనే వారి భవిష్యత్ ఉందని చెన్నూరు ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి,పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. మందమర్రి తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన కాకా ఫ్రీ కోచింగ్ సెంటర్ కేంద్రాన్ని మంత్రి వివేక్,ఎంపీ వంశీ కృష్ణ ప్రారంభించారు. అనంతరం ఫ్రీ కోచింగ్ సెంటర్ కు సంబంధించిన వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,డీసీపీ ఎగ్గడి భాస్కర్,డిసిసి ప్రెసిడెంట్ పిన్నింటి రఘునాథ రెడ్డి,అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి లతో కలిసి ఆవిష్కరించారు. అలాగే క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డు అమరవాదిలో నూతనంగా నిర్మాణం చేయనున్న బతుకమ్మ ఘాట్ పనులను శంకుస్థాపన చేశారు. పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్,మాజీ అధ్యక్షుడు పల్లె రాజు,స్థానిక వార్డు కౌన్సిలర్ దాముఖ శిరీష - రమేష్ పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్ల సేవలు అభినందనీయం..

## - ఎమ్మెల్యే కాలే యాదయ్య



చేవెళ్ల, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): ఫోటోగ్రఫీ కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, మనిషికి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చిపెట్టే అద్భుతమైన కళ అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా బుధవారం చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఫోటోగ్రాఫర్లకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో జరిగే విభిన్న సంఘటనలు, శుభకార్యాలు, ప్రకృతి అందాలను కెమెరా కంటితో బంధించి భవిష్యత్ తరాలకు జ్ఞాపకాలుగా అందించే ఘనత ఫోటోగ్రాఫర్లకే దక్కుతుందన్నారు. ఎంతటి సంఘటననైనా ఒక్క ఫోటోతో స్పష్టంగా వివరించగల శక్తి ఫోటోగ్రఫీకి ఉందని పేర్కొన్నారు. సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినా ఫోటోగ్రఫీకి ఉన్న ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదన్నారు. వార్తలకు, ప్రజల జ్ఞాపకాలకు ప్రాణం పోస్తూ నిరంతరం కష్టపడుతున్న ఫోటోగ్రాఫర్ల సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఫోటోగ్రఫీ రంగంలో మరింతగా రాణించాలని ఫోటోగ్రాఫర్లకు సూచించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి చేవెళ్ళ పిఏసిఎస్ చైర్మన్ లు గోనె ప్రతాప్ రెడ్డి, దేవర వెంకట్ రెడ్డి, నాయకులు బండారి ఆగి,రెడ్డి, మర్పల్లి కృష్ణారెడ్డి, మూడవత్ కృష్ణ నాయక్, మధుసూదన్ రెడ్డి, దావల్గారి గోపాల్ రెడ్డి, పెంటయ్య గౌడ్, రాము గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఖదీర్ హుస్సేన్, రంగారెడ్డి జిల్లా ఫోటో గ్రాఫర్ల సంఘం అధ్యక్షులు శివలింగం గౌడ్, రాష్ట్ర ఫోటో గ్రాఫర్ల సంఘం మీడియా ఇంచార్జి శేఖర్ గౌడ్, చేవెళ్ళ మండల ఫోటో గ్రాఫర్ల సంఘం అధ్యక్షులు కిషన్ కోఫ్లీ, ఉపాధ్యక్షుడు శ్రీను, ప్రధాన కార్యదర్శి మల్లేష్, కోశాధికారి జనార్దన్, వ్యవస్థాపకు అధ్యక్షులు శివ శంకర్, కుర్వ మల్లేష్, సీనియర్ ఫోటో గ్రాఫర్ పాండు, నసీర్ (తాజ్), గొంగుపల్లి రాఘవేందర్, అశోక్, బలరాం, సుదర్శన్, వెంకటేష్, మసీయొద్దీన్ (చోటు), అశోక్, మహిపాల్, మహేష్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరుపేదలకు వరం లాంటిది



**- ప్రతి నిరుపేదలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం**

**-: ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు హాజరైన మండల అధ్యక్షులు దుర్గారెడ్డి. గ్రామ అధ్యక్షులు మున్నూరు మాణిక్యం పటేల్**

చౌటకూర్ ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర):- పుల్కల్ మండల పరిధిలోని ఈసోజిపేట గ్రామంలో ఇటీవల నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను బుధవారం నాడు ప్రారంభోత్సవం చేశారు ఈ గృహప్రవేశాలకు ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుర్గారెడ్డి గ్రామ అధ్యక్షులు. మున్నూరు మాణిక్యం పటేల్ వీరి చేతుల మీదుగా అట్టి నూతన గృహప్రవేశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వాడి చేతుల మీదుగా నూతన గృహాలను ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు అన్నారు అంతేకాకుండా గ్రామంలో ఉన్న ప్రతి నిరుపేదలను అన్ని విధాల ఆదుకునేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు ప్రజల సంక్షేమానికి తమ మంత్రివర్యులైన దామోదర్ రాజనర్సింహ పుల్కల్ మండలం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని ఉద్దేశంతో తన మంత్రివర్యులు ఎన్ని నిధులైన మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉ న్నారన్నారు ఏ ప్రభుత్వం చేయలేని పనులు కేవలం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నా యని వారు కొనియాడారు ఈ కార్యక్రమంలో పుల్కల్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మున్నూరు మల్లేష్ పటేల్ నూతన ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులు పార్టీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# జీవో 97 రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థుల మానవహారం



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగస్టు 19 : టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను శక్తి శాఖలో విలీనం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మానవహారంగా ఏర్పడి కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐటీఐ,పాలిటెక్నిక్ విభాగాలను శక్తి శాఖలో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్య పూర్తిచేసిన అనంతరం బీటెక్‌లో ప్రవేశాలకు సీట్ల సంఖ్య పెంచాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. శక్తి పథకాన్ని అమలు చేయడం కంటే పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉన్నత విద్యలో మెరుగైన అవకాశాలు కల్పించాలని కోరారు. విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి స్పందించి విలీన ప్రక్రియను ఉపసంహరించుకుని జీవో 97ను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ పెంచడంతో పాటు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని, కళాశాల తరగతులు, పరీక్షలు బహిష్కరిస్తామని విద్యార్థులు తెలిపారు.

# వైభవంగా దుర్గమ్మ, పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

## - పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి సబితారెడ్డి



చేవెళ్ల ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): చేవెళ్ల మండల పరిధిలోని దేవరంపల్లి గ్రామంలో దుర్గమ్మ, పోచమ్మ ఆలయాల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బచ్చుగారి నరహరి రెడ్డి ఆధ్వర్యంలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలను పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల అభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్ బచ్చుగారి నరహరి రెడ్డిని అభినందించారు. గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, నియోజకవర్గ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు వంగ శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి దేశమొళ్ళ ఆంజనేయులు, బీఆర్ఎస్ కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి, మంగమ్మ మల్లేష్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 15 వార్డులు.. ఎన్నో సమస్యలు.. అభివృద్ధిపై ప్రజల ఆశలు

కడ్తల్ ఆగస్టు 19 : (విజన్ ఆంధ్ర) ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 15 వార్డులు ఉన్నాయి. పట్టణం రోజురోజుకూ విస్తరిస్తూ జనాభా పెరుగుతుండటంతో ప్రజల అవసరాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఒకప్పుడు చిన్న పట్టణంగా ఉన్న ఆమనగల్లు ప్రస్తుతం వ్యాపార, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి చెందుతూ చుట్టుపక్కల గ్రామాలకు ప్రధాన కేంద్రంగా మారుతోంది. దీంతో పట్టణంలో మౌలిక వసతులను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఏర్పడింది.

మౌలిక వసతులే ప్రధాన అవసరం

15 వార్డుల్లో ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, వీధిలైట్లు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండాలని ప్రజలు కోరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు సక్రమంగా వెళ్లేందుకు శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు.

అభివృద్ధికి ప్రణాళిక అవసరం

పట్టణ విస్తరణను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించాలని ప్రజలు కోరుతున్నారు. ఒక్కో వార్డులో ఉన్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడితే ప్రజలకు మెరుగైన ఫలితాలు అందుతాయని అభిప్రాయపడుతున్నారు. రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీ పనులు సమాంతరంగా చేపట్టాలని, లేకపోతే కొత్తగా వేసిన రోడ్లు కొద్దికాలానికే దెబ్బతినే అవకాశం ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు కూడా మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రతి వార్డులో క్రమం తప్పకుండా చెత్త సేకరణ, కాలువల శుభ్రత, దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో కూడా పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు సూచిస్తున్నారు.

వర్షం వస్తే ఇబ్బందులు

ఆమనగల్లు పట్టణంలో ఇటీవల కురుస్తున్న వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో రహదారులపై నీరు నిలిచిపోవడం మరోసారి డ్రైనేజీ సమస్యను తెరపైకి తెచ్చింది. పట్టణంలోని ప్రధాన రహదారులు, వ్యాపార ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో నీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి

మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. ప్రతి వార్డులో ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని, వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపితే పట్టణ అభివృద్ధి మరింత వేగవంతమవుతుంది. రాజకీయాలకు అతీతంగా పట్టణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి ప్రణాళికలు అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'ఆమనగల్లు ఎలా ఉండాలి?' అన్నదే ప్రశ్న

రానున్న రోజుల్లో ఆమనగల్లు పట్టణం మరింత విస్తరించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇప్పటి నుంచే భవిష్యత్ అవసరాలను అంచనా వేసి అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. విశాలమైన రహదారులు, పక్కా డ్రైనేజీ వ్యవస్థ, పరిశుభ్రమైన వీధులు, తగినంత వీధిలైట్లు, పచ్చని పార్కులు, మెరుగైన ప్రజా సౌకర్యాలు అందుబాటులోకి వస్తే ఆమనగల్లు మరింత సుందరంగా మారనుంది. 15 వార్డుల్లోని ప్రతి కుటుంబానికి మౌలిక వసతులు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని పట్టణ ప్రజలు ఆశిస్తున్నారు.

## సహకార సంఘం చైర్ పర్సన్ గా నాగభూషణం



లక్షెట్టిపేట ఆగష్టు,19(విజన్ ఆంధ్ర ) మండలంలోని జెండా వెంకటాపూర్ రైతు సహకార సంఘం నూతన చైర్ పర్సన్ గా పట్టణానికి చెందిన చెల్ల నాగభూషణం బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా కేతిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, నస్పూరి సత్యం, సంఘం శ్రీనివాస్,గంగినేని హరీష్, భాగ్యమ్మ, సువర్ణ, సుధాకర్, జగ్గన్న, రాజయ్య, లింగయ్య, రత్తయ్య,జంగు ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, గుల్లకోట చైర్ పర్సన్ గా పెయ్యాల దేవేందర్ రెడ్డి తో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ సమక్షంలో పాలక వర్గాలకు నియామక పత్రాలు అందజేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు నూతన పాలక వర్గాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షులు, వెంకట్రావ్ పేట్ సర్పంచ్ నలిమేల రాజు, నాయకులు పూర్ణ చందర్ రావు,దొంత నర్సయ్య,పింగళి రమేష్,మోహన్, సుమన్, సుధాకర్, అనుమాల వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కే ఓసి ఫేస్ 2 అటవీ భూమి పరిశీలన



మందమర్రి, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర) : సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆర్కేపీ ఓసి ఫేస్ 2 కొరకు కేటాయించిన 366 హెక్టార్ల అటవీ భూమిని ఐఎఫ్ఎస్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారామ్,జిల్లా అటవీ అధికారి రాహుల్ కిసాన్ జాదవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ భూమికి బదులుగా సమాన విస్తీర్ణతలో పరిహార అటవీ పెంపకం చేపట్టుటకు కేటాయించిన కేకే ఓసి డంప్ స్థలాన్ని ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణతో కలిసి సందర్శించారు. వారితో పాటు డివిజనల్ ఆఫీసర్ సర్వేశ్వర్,రేంజ్ ఆఫీసర్ రత్నాకర్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తలకొండపల్లి లోని ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**- ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ జెండా ఆవిష్కరణ**

**- ఫొటో అండ్ వీడియో గ్రావర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు గుద్దేటి మహేష్**

మిడ్జిల్, ఆగస్టు 19, (విజన్ ఆంధ్ర): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలోని ఫొటోగ్రఫీ కళను, జ్ఞాపకాలను భద్రపరిచే ఫొటోగ్రాఫర్ల సేవలను మరువలేమని ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు గుద్దేటి మహేష్, మండల ప్రధాన కార్యదర్శి కాలే శేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ దాగురే చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ జెండా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం కేక్ కటింగ్ చేసి, పలువురికి అరటి పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు గుద్దేటి మహేష్, మండల ప్రధాన కార్యదర్శి కాలే శేఖర్ మాట్లాడుతూ ఫొటో గ్రఫీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆగస్టు 19న ప్రపంచ ఫొట్రోగ్రఫీ దినోత్సవంగా సందర్భంగా ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగాల అభివృద్ధితోపాటు వృత్తిపరంగా ఎదురవుతున్న సమస్యలు, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. వారి సంక్షేమానికి సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. 1839 ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం లూయిస్ దాగురే రూపొందించిన దాగ్యు రేటైప్ ఛాయాచిత్ర ప్రక్రియను ప్రపంచానికి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆ చారిత్రక ఘట్టానికి గుర్తుగా 2026లో 187వ ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. ఫొటోగ్రఫీ కళ, శాస్త్రం, చరిత్ర, సామాజిక ప్రభావాన్ని ప్రపంచవ్యాప్తంగా గుర్తుచేసుకునే సందర్భంగా నిలిచింది. వెయ్యి మాటలు చెప్పలేనిది ఒక చిత్రం చెబుతుంది, అనే నానుడి ఫొటోగ్రఫీ విశిష్టతను తెలియజేస్తుంది. కాలం గడిచిపోతుంది. మనుషులు మారిపోతారు. నాగరికతలు రూపాంతరం చెందుతాయి. కానీ ఒక ఛాయాచిత్రం మాత్రం ఆ క్షణాన్ని యథాతథంగా భవిష్యత్తు తరాలకు అందిస్తుంది. అందుకే ఫొటోగ్రఫీ కేవలం కళ మాత్రమే కాదు. చరిత్రను భద్రపరిచే దృశ్యభాషగా ప్రపంచం నేడు గౌరవిస్తోంది. ప్రపంచంలో కెమెరా ఆవిష్కరణ జరిగిన కొద్ది సంవత్సరాల్లోనే భారతదేశంలో ఫొటోగ్రఫీ ప్రారంభమైంది. పురావస్తు సంపద, దేవాలయాలు, రాజ భవనాలు, సంస్కృతి, స్వాతంత్ర్యోద్యమం, సామాన్య ప్రజల జీవనవిధానాన్ని కెమెరా ద్వారా భద్రపరిచిన దేశాల్లో మనదేశం ఒకటి. హైదరాబాద్ చిరస్థాయిగా అనుబంధం ఏర్పరచుకున్న రాజా దీనదయాల్ భారతీయ ఛాయాచిత్ర చరిత్రలో చిరస్మరణీయుడు. ఆయన చిత్రీకరించిన నిజాం కాలంనాటి హైదరాబాద్, చార్మినార్, గోల్కొండ కోట, దక్కన్ సంస్కృతి నేటికీ ప్రపంచ మ్యూజియంలలో నిల్వవుండటం భారతీయ ఫొటోగ్రఫీ గొప్పతనానికి నిదర్శనం తెలిపారు. ఈ కార్యక్రమంలోని మండల అధ్యక్షులు గుద్దేటి మహేష్, మండల ప్రధాన కార్యదర్శి కాలే శేఖర్, సీనియర్ ఫోటోగ్రాఫర్లు

హీరా రాహుల్, డాన్ శ్రీను,నరసింహ, శేఖర్, సభ్యులు నగేష్,శ్రీకాంత్, తరుణ్, కృష్ణ, మహేష్, కిరణ్,చెన్నకేశవులు, స్టిల్ శ్రీను నాయక్ ,శ్రీరామ్,జగన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దవేడు గ్రామంలో నూతన పాఠశాల, అంగన్వాడీ భవనాల ప్రారంభం

## - విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ..
## - గ్రామీణ విద్యాభివృద్ధికి అమెజాన్ సంస్థ సహకారం

షాబాద్, ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర): షాబాద్ మండలం పెద్దవేడు గ్రామంలో విద్యాభివృద్ధికి మరో ముందడుగు పడింది. అమెజాన్ సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం, అంగన్వాడీ భవనాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్యతో కలిసి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి నూతన భవనాలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు చిన్నారులకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో అమెజాన్ సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంది. ఇప్పటివరకు ఉన్న వసతులతో పోలిస్తే నూతన భవనాల ద్వారా విద్యార్థులకు, అంగన్వాడీ చిన్నారులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో విద్యకు సంబంధించిన మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎంతో ముఖ్యమన్నారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు మెరుగైన భవనాలు అందుబాటులో ఉండటం



వల్ల విద్యార్థులు, చిన్నారులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వంతో పాటు వివిధ సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో విద్య, చిన్నారుల సంక్షేమం కోసం ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ...అమెజాన్ సంస్థ పెద్దవేడు గ్రామంలో పాఠశాల, అంగన్వాడీ భవనాల నిర్మాణానికి సహకరించడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకుందని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

లిలివిద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీలిలి

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యలో వినియోగించుకునేలా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ చేపట్టడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. డిజిటల్ విద్యకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ల్యాప్‌టాప్‌లు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. నూతన పాఠశాల భవనం, అంగన్వాడీ కేంద్రం అందుబాటులోకి రావడంతో గ్రామంలోని విద్యార్థులు, చిన్నారులకు మెరుగైన వసతులు లభించనున్నాయి. పాఠశాల పరిసరాలు విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా వారి విద్యాభ్యాసానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని అధికారులు తెలిపారు. నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, అమెజాన్ సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామంలో నూతన పాఠశాల, అంగన్వాడీ భవనాలు ప్రారంభం కావడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేయడం కూడా గ్రామీణ విద్యార్థులకు డిజిటల్ విద్యను చేరువ చేసే మంచి ప్రయత్నమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ జోనల్ మేనేజర్ జ్యోతి, ఎమ్మార్వో అన్వర్, ఎంపీడీవో అపర్ణ, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటరెడ్డి, సర్పంచులు, అమెజాన్ సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలు

భూపాలపల్లి జిల్లా ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర ) జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు అభిమానులు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ మంత్రి కొండా సురేఖ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆ దేవుడు ఆమెకు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆ దేవుడు సల్లగా చూడాలని వేడుకున్నారు.

## ఎస్సీ ఎస్టీ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్యను సన్మానించిన ఎల్ హెచ్ పిసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా సమ్మయ్య నాయక్...

మల్హర్, ఆగస్టు 19 విజన్ ఆంధ్ర : భూపాల పల్లి లో పలు అంశాలపై చర్చించడానికి వచ్చిన ఎస్సీ ఎస్టీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన లంబాడి హక్కుల పోరాట సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర సమ్మయ్య నాయక్, మాజీ జెడ్పిటిసి జోగుల సమ్మయ నాయక్ బీసీ ఎస్సీ ఎస్టీ జెఏసీ యాక్షన్ కమిటీ భూపాలపల్లి జిల్లా చైర్మన్ రాదండి దేవేందర్ కలిసి శాలువతో ఘనంగా సన్మానించడం జరిగింది...



# ప్రజా పాలనలో తాండవిస్తున్న అవినీతి బాగోతం..!

## - పైసా లేనిదే ఫైలు కదలని వైనం,
## - ప్రతి చిన్న పనికి ఆశ.. అంతకుమించిన కాలయాపన,
## - పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టకపోతే.. ప్రజా పాలనకు ముప్పు తప్పదా,

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 19 (విజన్ ఆంధ్ర ప్రతినిధి):ప్రజల చేత.. ప్రజల కోసం ఎన్నుకోబడిన ప్రజా ప్రభుత్వంలో కొందరి అధికారుల ఇష్టారాజ్యం మితిమీరిపోతుంది. వారి అవినీతి బాగోతం రోజురోజుకు చర్చనీయాంశం అవుతుంది. ప్రతి చిన్న పనికి పైసా లేనిదే ఫైలు కదలని దుస్థితి నెలకొంది. పైసా ఇవ్వని పనులను వివిధ కారణాలతో కార్యాలయాల చుట్టూ తిప్పుతూ కాలయాపన చేస్తున్నారు. ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో వారి దరికి తెచ్చుకుంటున్నారు. పారదర్శకంగా విధులు నిర్వర్తించాల్సిన అధికారులు రోజువారి, నెలవారీ టార్గెట్లను పెట్టుకుని ఒకరికి మించి ఒకరు పోటీ పడుతూ అక్రమ సంపాదనకు ఒడిగడుతున్నారన్న అపవాద నెలకొంది. అధికారులకు ఉన్న అధికారాలను అడ్డం పెట్టుకొని.. చట్టంలోని లొసగులను ఆసరాగా చేసుకుని వారు ఆడిందే ఆట... పాడిందే పాట అన్న చందంగా తయారయింది.!

ప్రజల బాధ వర్ణనాతీతం..!

నిస్వార్ధంగా విధులు నిర్వర్తించాల్సిన అధికారులు ప్రతి చిన్న పనికి పైసలు ఆశిస్తూ ఉండడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేక భావం ఏర్పడుతుంది. నెల నెల వేలల్లో, లక్షల్లో జీతాలు వస్తున్నప్పటికీ సామాన్యుల నుంచి డబ్బులు ఎందుకు ఆశిస్తున్నారో అర్థం కావడం లేదని పలువురు అమాయక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో, మండల స్థాయిలో అధికారులను మొదలుకొని జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల వరకు ప్రతి పనిని కొందరు ఆర్థిక కోణంలోనే చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైసలు ఇవ్వని వారి పనిని వారం, నెలలు, సంవత్సరాల తరబడి కూడా తిప్పుతున్నారని పలువురు వాపోతున్నారు. కొంతమంది అధికారులు పైరవీకారుల ద్వారా పనులు చక్కబెడుతున్నట్లు సమాచారం. మరికొంతమంది మాత్రం అప్పటికప్పుడు పైసలు ఇచ్చి పనులు చేయించుకుంటున్నారని, వారి పని క్షణాల్లో జరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అవినీతి బాగోతాలపై ఇటీవల కాలంలో అధికార పార్టీకి చెందిన పలువురు సర్పంచులు, నాయకులు ప్రెస్ మీట్ పెట్టి మరీ అధికారుల అవినీతిని ఎండగట్టిన విషయం పాఠకులకు విధితమే.

ప్రజా ప్రభుత్వానికి పెను సవాల్..!

ఒకవక్క కాంగ్రెస్ సర్కార్ తమది ప్రజా ప్రభుత్వమని చెబుతున్నప్పటికీ... ఆచరణలో ప్రజలకు అందనంత దూరాన ఉందని పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా ప్రభుత్వమంటే అధికారుల ద్వారా ప్రజలకు పాలనలో, సేవలలో చేరువ కావాల్సి ఉంటుంది.! ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా న్యాయంగా నిజాయితీగా తమ బాధ్యతలను నెరవేర్చాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అన్ ఎడ్యుకేటెడ్, అమాయక ప్రజలను, రైతన్నలను ముప్పు తిప్పలు పెడుతున్నారన్న చర్చ "టాక్" ఆఫ్ ది టౌన్ గా మారిపోయింది. నిజాయితీగా ఇటు ప్రజలకు సేవలు అందించడంలోనూ.. అటు ప్రజా ప్రభుత్వానికి జవాబుదారి తనంగా ఉండడంలోనూ కొంతమంది అధికారులు విఫలమవుతున్నారన్న వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ఓట్ల రాజకీయాల కోసం ప్రభుత్వాలు కూడా అధికారుల వ్యవహార శైలిని చూసి చూడనట్లుగా లైట్ తీసుకుంటున్నాయన్న ఆరోపణలు ఊపొందుకుంటున్నాయి. అధికారులు తలుచుకుంటే ప్రభుత్వాలను కూలదోస్తాయన్న బహిరంగ హెచ్చరికలు కూడా ప్రజా ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయేమో తెలియని పరిస్థితి నెలకొంది.

ప్రజల తీరు మారాలి.. ప్రశ్నించే ధోరణి అలవర్చుకోవాలి..!

ప్రభుత్వ కార్యాలయంలో ఉచితంగా సేవలు పొందే హక్కు ప్రతి ఒక్క పౌరుడికి ఉంటుంది. ఆ సేవను డబ్బుతో కొనాలనే ఆలోచనను విడనాడాలి. ఏ పని ఏ అధికారితో అవుతుందో అన్న స్పష్టతను కలిగి ఉండాలి. అధికారుల మీద మీద పడి పని చేయించుకునే బదులు... ప్రతి ఒక్కరు ప్రశ్నించే వైఖరి అవలంబించుకోవాలి. సంబంధిత శాఖల అధికారులు పనిచేయకపోతే పై అధికారులకు ఫిర్యాదు చేసే ధోరణి ఉండాలి. కాలయాపనకు చేస్తూ ఉంటే కాలయాపన ఎందుకు జరుగుతుందో లిఖితపూర్వకంగా అధికారుల చేత రాయించుకోవాలి. డబ్బుల కోసం ఇబ్బందులకు గురి చేస్తే అవసరమైతే ఏసీబీ అధికారులను ఆశ్రయించాలి. ప్రజా సేవ కోసం విధులను నిబద్ధతతో నిర్వర్తించే అధికారులు అసలు విషయాన్నీ మర్చిపోకూడదు. కొందరు అధికారులైతే ఏకంగా చట్టంలో ఉన్న లొసగులను ఆసరాగా చేసుకుని, అధికారులకు ఉన్న అనుకూలతలను ఉపయోగించుకొని కోర్టులను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారంటే పరిస్థితిని మనం ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఏదిఏమైనాప్పటికీ ప్రజా పాలనలో.. అధికారుల వ్యవహార శైలిలో.. ప్రజల్లో సానుకూలమైన మార్పు వచ్చినప్పుడే గాంధీజీ కలలుగన్న స్వాతంత్రం ప్రతిఫలాలు సిద్ధిస్తాయని ఆశిద్దాం.